# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 20-8-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:15 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

దోమల నిర్మూలించుచు
క్షేమమ్మును పెంపుచేయు స్థిర లక్ష్యముతో
దోమల దినోత్సవమ్మును
ప్రేమగ జరుపంగవలయు విభవమ్మొప్పన్

(ఆగష్టు 20 ప్రపంచ దోమల దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

నీతులు వల్లించుడే
నేతల్లో ఒక వింత
అవినీతి అక్రమాలే
అగుపిస్తే తనువంతా
అధికారంలెవరున్నా
అవి అంటని వారెవరు
దొబ్బితింటూ నడవడమే
దొరలాగా వాళ్ల పవరు



-వేల్పుల నారాయణ
9440433475

## మనిషిని ఆలోచింప జేసే శక్తి ఫోటోలకు వుంటుంది

### -రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్: ఆగస్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్):అంకిత భావంతో సృజనాత్మకంగా తీసిన ఒక ఫోటో కొన్ని పేజీల వార్తా సారాంశమును అర్థవంతంగా తెలియజేసి, పాఠకులను ఆలోచింప చేస్తుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నేడు అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, ఫోటోగ్రఫీ ప్రదర్శనను ప్రారంభించారు. ప్రతి రోజు దినపత్రికలు చదవటం అలవాటని, అన్ని వార్తలు చదవక పోయినా , అన్ని పేజీలలోని ఫోటోలను చూసి, ఆ వార్తలోని అంశాన్ని అర్థం చేసుకుంటానని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభయహస్తం హామీలపై నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలకు వచ్చిన ఫోటో ఎంట్రీలను ఇక్కడ ప్రదర్శించారు. 5 కేటగిరీలలో జ్యూరీ సభ్యులు ఎంపిక చేసిన ఫోటోలను తీసిన ఫోటోగ్రాఫర్లుకు మేమెంటో, శాలువా, నగదు పురస్కారాల ను ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేసి , అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఫోటోకు జీవం పోసేందుకు ఫోటోగ్రాఫర్లు అంకితభావంతో కష్టపడతారని ప్రశంసించారు. తెలంగాణ పాలనలో మార్పు కు తెచ్చుకున్న ఇందిరమ్మ రాజ్యం లో అభయహస్తం అమలుకు గత 8 నెలలుగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు కు ప్రభుత్వం చేస్తున్న కృషికి నేటి ఫోటోగ్రఫీ ప్రదర్శన నిదర్శనంగా నిలుస్తోందని చెప్పారు. ఫోటోగ్రాఫర్ల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పనిచేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫోటో తో కూడిన వార్త కు పరిపూర్ణత చేకూరుతుందని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఈ వేడుకల్లో ఆయన గౌరవ అతిథిగా హాజరైనారు. క్షేత్ర స్థాయిలో అనేక ఆటుపోట్లు, ఇబ్బందులను భరించి ఫోటోగ్రాఫర్లు పనిచేస్తారని చెప్పారు. కొన్ని సందర్భాల్లో జర్నలిస్టుల కంటే ఎక్కువ కష్ట పడి విధులు నిర్వహిస్తారని తెలిపారు. మనిషిని ఆలోచింప జేసే శక్తి ఫోటోలకు వుంటుందని చెప్పారు. ఫోటోగ్రాఫర్ల ను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందని పేర్కొన్నారు. 5 కేటగిరీలలో నిర్వహించిన అంతర్జాతీయ ఫోటోగ్రఫీ డే పోటీలలో 101 మంది 990 ఫోటోలను పంపినట్లు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ యం. హనుమంతరావు తెలిపారు. ఫోటోగ్రఫీ, జర్నలిజం లలో నిష్ణాతులైన న్యాయ నిర్ణేతలు ప్రతి కేటగిరీలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు మరియు 5 కన్సొలేషన్ బహుమతులకు ఫోటోలను ఎంపిక జేసినట్లు తెలిపారు.

## తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్

హైదరాబాద్ ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: తెలంగాణ నుంచి రాజ్యసభకు జరిగే ఉప ఎన్నికకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యూసి) సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఏఐసిసి ఇన్‌చార్జి దీపా దాన్‌మున్షీ, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు తోడు రాగా సింఘ్వీ రాష్ట్ర అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి ముందు తన నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ నేతలు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుసార్లు ఎంపీగా ఎన్నికైన సింఘ్వీ నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సెప్టెంబరు 3న జరగనున్న ఉపఎన్నికకు ఇప్పటి వరకు నామినేషన్ దాఖలు చేసిన మొదటి అభ్యర్థి ,ఏకైక అభ్యర్థి కాంగ్రెస్ నాయకుడు సింఘ్వీయే.గత నెలలో కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ మాజీ ఎంపీ కె. కేశవరావు రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. నామినేషన్ల దాఖలుకు ఆగస్టు 21 చివరి తేదీ, పరిశీలన తేదీ ఆగస్టు 22. అభ్యర్థిత్వ ఉపసంహరణకు ఆగస్టు 27 చివరి తేదీ.ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్)కి అభ్యర్థిని నిలబెట్టె సంఖ్య లేకపోవడంతో సింఘ్వీ రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికవు తారని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికు రాఖీలు కట్టిన మహిళా నేతలు



హైదరాబాద్, ఆగష్టు 19 : రక్షా బంధన్ సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నివాసం వద్ద సందడి నెలకొంది. కాంగ్రెస్ మహిళా నేతలు ముఖ్యమంత్రికి రాఖీలు కట్టారు. సీఎం రేవంత్ రెడ్డికి, ఆయన మనవడికి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, రాగమయి సీఎంకు రాఖీ కట్టారు. బండ్రు శోభారాణి, కాల్వ సుజాత, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద కూడా ముఖ్యమంత్రి రేవంత్‌కి రాఖీలు కట్టారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ రాఖీ కట్టారు.

## రక్షా బంధన్‌ను పురస్కరించుకుని ప్రధానమంత్రి మోడీకి రాఖీ కట్టిన చిన్నారులు



న్యూఢిల్లీ ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దేశవ్యాప్తంగా రాఖీ పౌర్ణమి పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.. రక్షా బంధన్ ను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరంద్రమోడీకి చిన్నారులు రాఖీ కట్టారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి రక్షా బంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలికలతో ప్రధాని మోడీ ప్రత్యేకంగా మాట్లాడారు.. వారితో కలిసి సరదాగా పండుగను జరుపుకున్నారు.

ప్రధాని మోడీకి చిన్నారులు రంగు రంగుల రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రధాని మోడీ.. రాఖీ వేడుకలకు సంబంధించిన చిత్రాలను, వీడియోలను ఎక్స్ లో షేర్ చేశారు.. తన యువ స్నేహితులతో కలిసి రక్షా బంధన్‌ని జరుపుకున్నందుకు సంతోషంగా ఉందంటూ.. ప్రధాని మోడీ ఎక్స్ లో పోస్ట్ చేశారు.

## అలరించిన దక్షిణ భారత భాషల సాహిత్య సమ్మేళనం

బెంగళూరు ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సాహిత్య సృజన ఏ భాషలో ఉదయించినా చదువరుల హృదయాల్లో వికసిస్తూనే వుంటుందని బెంగళూరులో ఆగస్టు 9, 10, 11 తేదీల్లో జరిగిన దక్షిణాది రచయితల 'బుక్‌బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్'లో ఈ మూడు రోజులు పాల్గొన్నప్పుడు మళ్ళీ మళ్ళీ తోచింది. 'బుక్‌బ్రహ్మ' గత ఐదేళ్ళుగా సాహిత్యంలో అనేక కార్యక్రమాలని నిర్వహిస్తున్న గ్లోబల్ డిజిటల్ వేదిక. దక్షిణాది భాషా రచయితలను, ప్రచురణకర్తలను ప్రతి ఏటా కలిస్తే బాగుంటుందని, కొత్త దారులకు వెలుగవుతుందని 'బుక్‌బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్' నిర్వాహకులు సతీశ్ చప్పరికె భావించారు. వారి సంకల్ప బలం ఉన్నతమైనదవటంతో దక్షిణాది భాషల సాహిత్యోత్సవం ఎంతో కోలాహలంగా, ఆలోచనాత్మకంగా జరిగింది. దాదాపు రెండు వందలకి పైగా వక్తలు తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషల నుంచి 'బుక్‌బ్రహ్మ సాహితీ ఉత్సవం'లో పాల్గొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎవరైనా రిజిస్ట్రేషన్ చేయించుకుని ఈ ఉత్సవంలో పాల్గొనవచ్చు. అలా ఎంతో మంది తెలుగు సాహితీకారులు, సాహిత్య అభిమానులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. సాహిత్యం పట్ల ఉన్న గౌరవంతో ఈ బెంగుళూరు కార్యక్రమానికి అనేక వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు ప్రాయోజకత్వం ఇచ్చాయి. ఎంతోమంది విద్యార్థులు, యువతీ యువకులు స్వచ్ఛందంగా, ఉత్సాహంగా పని చేశారు. వందలాది మందికి వసతినిచ్చిన ప్రాంగణం పువ్వులతో.. మొక్కలతో.. చెట్లతో కళకళలాడుతూ ఉంది. బోలెడన్ని పక్షుల సన్నని రాగాలు. ఇంత పెద్ద సాహితీ ఉత్సవం నిర్వహణతో ఎంతో బిజీగా ఉన్నా, వచ్చిన ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ, ఆహ్వానించారు 'బుక్ బ్రహ్మ' నిర్వాహకులు సతీశ్ చప్పరికె. అలానే తెలుగుకి క్యూరేటర్‌గా వ్యవహరించిన విలువైన కవి, అనువాదకులు, చక్కని చదువరి అజయ్ వర్మఅల్లూరి తెలుగు నుంచి ఈ కార్యక్రమంలో వక్తలుగా పాల్గొనటానికి ఆహ్వానించిన వారిని, ఆసక్తి, అభిమానంతో ఉత్సాహంగా ఈ సభలకి వచ్చిన రచయితల్ని, సాహితీ పాఠకుల్ని, అభిమానుల్ని సంతోషంగా ఆహ్వానిస్తూ అందర్నీ చాలా చక్కగా చూసుకుంటూ, ఎవరూ కొత్తప్లేస్‌లో ఉన్నామని ఫీల్ కాకుండా కంఫర్ట్‌గా ఫీల్ అయ్యేట్టు అందర్నీ వారు చూసుకున్న పద్ధతి ఎంతో ప్రశంసనీయం. వాలంటీర్స్ అయితే మనం దేనికీ తడుముకోనక్కరలేకుండా ఎంతో తోడూ నీడగా వున్నారు. దక్షిణాది రచయితలు అనేక వేదికలపై వారివారి భాషలోనే వారి గొంతుని స్పష్టంగా వినిపించారు 'బుక్‌బ్రహ్మ' లిటరేచర్ ఫెస్టివల్లో కొన్ని వేదికల మీద నాలుగు భాషల రచయితలు ఇంగ్లీషులో తమ గొంతుని వినిపించారు. కన్నడ సాహిత్య, సాంస్కృతిక, ఆతిథ్య అభిరుచులు, రుచులూ ఈ సాహిత్యోత్సవంలో ఎంతోమందికి అనుభవంలోకి వచ్చాయి. గొప్ప సృజనకారులైన రచయితల్ని కలుసుకోవటం, మాట్లాడటం, వినటం విలువైన అనుభవం. ప్రారంభ వేదిక మీద హెచ్. ఎస్.శివ ప్రకాష్, జయమోహన్, ఓల్గా, వివేక్ శానభాగ్, కె. సచ్చిదానందన్ ప్రసంగించారు. 'తెలుగు అనువాదాలు కొత్త ఒరవడి' అనే అంశం మీద కాత్యాయిని, పూర్ణిమా తమ్మిరెడ్డి, అవినేని భాస్కర్, ధూర్జటి వెంకట శుభశ్రీ అనువాదాలు చెయ్యటంలోని విషయాల్ని వీలైనంత వివరంగా మాటాడారు. 'స్త్రీవాదం నుండి దళిత స్త్రీవాదం వైపు' అనే అంశం మీద చల్లపల్లి స్వరూపరాణి, జూపాక సుభద్ర, ఎం.ఎం. వినోదిని, మానస ఎండ్లూరి వారివారి అభిప్రాయాల్ని పంచుకున్నారు. 'సౌత్ ఇండియన్ లాంగ్వేజెస్: ది క్వశ్చన్ ఆఫ్ ఎగ్జిస్టెన్స్' అనే అంశం మీద జరిగిన ప్యానల్ డిస్కషన్‌లో పాల్గొన్న ఒ.ఎల్. నాగభూషణ స్వామి, పాల్ జకారియా, పెరుమాళ్ మురుగన్, వాడ్రేవు చినవీరభద్రుడు, ప్రతిభా నందకుమార్ ప్రస్తుతం ఆయా భాషలు ఎదుర్కొంటున్న సవాళ్ళు, వస్తున్న మార్పుల్ని, బలాల్ని చర్చించారు. సమకాలీన తెలుగు నవల మీద అక్కినేని కుటుంబరావు, కె.ఎన్. మల్లీశ్వరి, ఉణుదుర్తి సుధాకర్, అరవింద్ ఎ.వి. సమకాలీన తెలుగు నవల ఎలా వుందో వివరించారు. 'తెలుగులో స్త్రీల ఆత్మకథలు' మీద సి. మృణాళిని, కాత్యాయిని విద్మహే, కె.ఎన్. మల్లీశ్వరి, పి. జ్యోతి మాట్లాడారు. ఈ సమావేశంలో ఆత్మకథలు రాసేటప్పుడు ఏయే విషయాలు సెన్సార్ చేసుకుంటున్నారు, కొన్నిసార్లు ఎందుకు సెన్సార్ చేసుకోవాలో? తెగింపు ధోరణితో వ్యక్తీకరించినంత మాత్రాన ఆ ఆత్మకథ విలువైనదవుతుందా అనే విషయాలు చర్చకు వచ్చాయి. 'మీడియా ప్రిజర్వ్స్ లిటరేచర్ అండ్ కల్చర్' అంశం మీద మయూర శ్రేయామ్స్ కుమార్, కె. శ్రీనివాస్, ఎస్.ఆర్. రామకృష్ణ, బాగేశ్రీ తమ విలువైన గమనింపుల్ని చెప్పారు. 'తెలుగు సబాల్టర్న్ స్వరాలు' అంశం మీద జరిగిన చర్చా కార్యక్రమంలో గోగు శ్యామల, మల్లిపురం జగదీశ్, వేంపల్లి షరీఫ్, రమేష్ కార్తీక్ నాయక్ సంభాషించారు. ఈ ఏడాది యువ పురస్కారం పొందిన రమేష్ కార్తిక్ నాయక్ సమావేశాన్ని నిర్వహించారు. మల్లిపురం జగదీశ్ కొండప్రాంతాల్లోకి మందుల కంటే ముందుగా మందు బుడ్డీలు వస్తున్నాయని తమ ప్రాంతపు సమస్యల్ని, పరిస్థితుల్ని వివరిస్తూ, తన మట్టిని గురించి, తన వాళ్ళను గురించి రాయడమే తన కర్తవ్యమని అన్నారు. 'తెలుగు కథా ప్రపంచం' అంశం మీద వివినమూర్తి, మహమ్మద్ ఖదీర్ బాబు, కుప్పిలి పద్మ, పూడూరి రాజిరెడ్డి తెలుగు కథా విభిన్న ప్రపంచాల్ని పంచుకున్నారు. ఇప్పటి వరకూ ఉన్న కథ, కథకుల ముందున్న సవాళ్ళు మొదలుగు విషయాల్ని చర్చించారు. 'నోవెల్: ఎ సెలబ్రేటెడ్ ఫార్మ్?' అనే అంశం మీద ఓల్గా, పెరుమాళ్ మురుగన్, బెన్యమిన్, వసుధేంద్ర మాట్లాడారు. ఓ వేదిక మీద 'భారతదేశపు పుస్తక ప్రచురణ'పై జరిగిన సమావేశంలో కణ్ణన్ సుందరం, వసుధేంద్ర, గీతా రామస్వామి, డి.సి.బుక్స్ రవి పాల్గొని ఆయా భాషలకు సంబంధించిన నేటి స్థితిగతులని పంచుకుంటూ యువత పుస్తకాలు చదవటంలేదని ఎవరైనా మాటాడితే యువతకి వాళ్ళు దూరంగా ఉన్నట్టేనన్నారు కణ్ణన్. మలయాళీ చదువర్ల సాహితీ తృష్ణకి ఈ సంఘటన ఓ ఆనవాలు. కరోనా సమయంలో పుస్తకాల అమ్మకాన్ని కొనసాగించడానికి స్విగ్గీతో ఒప్పందం చేసుకుని ఆహార పదార్థాలతో పాటు పుస్తకాలనూ అమ్మేరు. కరోనా సమయంలో పుస్తకాలను నిత్యావసరమైనవిగానే కేరళ ప్రభుత్వం పరిగణించింది. పుస్తకాల షాపులు, సెలూన్లు తెరిచే ఉంచినప్పుడు అలా ఉంచటం చట్టానికి వ్యతిరేకమని కేంద్రం హెచ్చరికలు చేసినప్పుడు సెలూన్లను మాత్రమే మూసివేశారు. ఈ సంఘటన కేరళలో పుస్తకాలు చదివేవారి ప్రత్యేకమైన చూపుని దర్శింపచేసింది. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగేవి. ఆదివారం ఉదయం ఎనిమిదిన్నరకు వెంకటేశ్ కుమార్ హిందుస్థానీ సంగీత కచేరీకి ఆడిటోరియం కిక్కిరిసిపోయింది. కన్నడ శైవవచనాల ఆలాపనల ఆ మధుర సంగీతంలో హృదయం ఆనందమయమై దాదాపు పదినిమిషాల స్టాండింగ్ ఒవేషన్‌తో సంతోషాన్ని, కృతజ్ఞతని వారికి కానుక చేశారు శ్రోతలు.

## ఎంపాక్స్‌పై మంత్రి దామోదర సమీక్ష..

హైదరాబాద్, ఆగష్టు 19 :తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంకీ పాక్స్‌పై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ, చెన్నైలలో మంకీ పాక్స్ కేసులు నమోదయ్యాయని? ఈ సందర్భంగా ముందస్తు చర్యలపై అధికారులతో సమీక్షించారు. వివిధ రాష్ట్రాల నుంచి చాలామంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణలో ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

తరచుగా ప్రయాణాలు చేసేవారు అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ టెస్ట్ చేయాలని? అవసరమైన మెడికల్ కిట్లు, మందులు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు తెలిపారు. గాంధీ ఆస్పత్రి, ఫీవర్ ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## జంపన్న చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ములుగు, ఆగష్టు 19 : ములుగు జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ యువ నాయకులు భూక్య జంపన్న నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జంపన్న చారిటబుల్ ట్రస్ట్‌ను ఆ పార్టీ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. సామాజిక సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో జంపన్న నాయక్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని ఆర్ఎస్పీ ప్రశంసించారు.

జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువత, మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి వారిని స్వశక్తితో స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇవ్వాలని ఆర్ఎస్పీ కోరారు. ఈ సందర్భంగా దివ్యాంగుడైన నగావత్ బాలు నాయక్‌కు ట్రైమోటార్ సైకిల్‌ను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా జంపన్న నాయక్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## టిజిఎస్ ఆర్టీసి బస్సులో గర్భిణికి డెలివరీ

### -పురుడు పోసిన మహిళా కండక్టర్ భారతి

### -కండక్టర్ భారతిని అభినందించిన తెలంగాణ ఆర్టీసి ఎండి సజ్జనార్

హైదరాబాద్ ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రక్షాబంధన్ సందర్భంగా బస్సులో గర్భిణికి పురుడు పోసిన మహిళా కండక్టర్ భారతిని తెలంగాణ ఆర్టీసి ఎండి సజ్జనార్ అభినందించారు. 'రాఖీ పండుగ నాడు టిజిఎస్ ఆర్టీసి బస్సులో గర్భిణికి డెలివరీ చేసి ఒక మహిళా కండక్టర్ మానవత్వం చాటుకున్నారు. తాను విధులు నిర్వర్తిస్తోన్న బస్సులో గర్భిణికి పురిటి నొప్పులు రాగా, ఆమె వెంటనే స్పందించి బస్సులో ప్రయాణిస్తోన్న నర్సుతో కలిసి ప్రసవం చేశారు. అనంతరం తల్లీబిడ్డను స్థానిక ఆస్పత్రికి తరలించారు. అని ఎండి సజ్జనార్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గద్వాల డిపోకు చెందిన గద్వాల- వనపర్తి రూట్ పల్లె వెలుగు బస్సులో సోమవారం ఉదయం సంధ్య అనే గర్భిణి రక్షాబంధనన్ సందర్భంగా తన సోదరులకు రాఖీ కట్టేందుకు వనపర్తికి వెళ్తున్నారు. బస్సు నాచహల్లి సమీపంలోకి రాగానే గర్భిణికి ఒక్కసారిగా పురిటినొప్పులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన మహిళా కండక్టర్ జి.భారతి బస్సును ఆపించారు.

## హైదరాబాద్‌లో ఏడాది పొడవునా 1500వ వార్షికోత్సవ 'మిలాద్-ఉన్-నబీ' వేడుకలు!



హైదరాబాద్ ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రవక్త ముహమ్మద్(స) జన్మదినం సందర్భంగా ముస్లింలు 'ఈద్ మిలాద్-ఉన్-నబీ' నిర్వహిస్తుంటారు. ప్రవక్త(స) బోధనలను గుర్తుచేసుకుంటారు. ప్రత్యేక ప్రార్థనలు(నమాజ్ లు) చేస్తారు. ముస్లింలు ఈ పర్వదినాన తీయని వంటకాలు చేసి ఇరుగుపొరుగు వారికి.. అందరికీ పంచుతారు. తన జన్మదినం గురించి ప్రవక్త(స) ఏమన్నారంటే, "నేను పుట్టిన రోజున, నాకు దైవ ప్రకటన(వహీ) అందింది" అని తెలిపారు. ప్రవక్త ముహమ్మద్(స) క్రీ.శ. 570 లో జన్మించారు. అదే సంవత్సరం దక్షిణ అరబ్బు రాజు అబ్రహా మక్కాను జయించే ప్రయత్నం చేశారు. దైవ జోక్యంతో దానికి అడ్డు పడిందని ఖురాన్ లోని 105 వ సూరాలో ఉంది. ముహమ్మద్(స) తండ్రి? ఆయన జననం కంటే ముందే కాల ధర్మం చేశారు. ఆయన పెంపకం బాధ్యతను తాతగారు అబ్దుల్-ముత్తాలిబ్ తీసుకున్నారు. సెంట్రల్ మిలాద్ ఊరేగింపు కమిటీ అని కూడా పిలువబడే 'మర్కజ్-ఎ-మిలాద్ జూలూస్ కమిటీ' హైదరాబాద్ లో మిలాద్-ఉన్-నబీ 1500వ వార్షికోత్సవం సందర్భంగా ఏడాదిపాటు కార్యక్రమాలను నిర్వహించనుంది. ఈ కార్యక్రమాల్లో సెమినార్లు, నాతియ మెహఫిల్స్, సాహిత్య పోటీలు ఉంటాయి. తన కార్యాలయంలో జరిగిన సమావేశం తరువాత, ఇతర మతస్థుల వారిని కూడా కార్యక్రమాల్లో చేర్చుకోవాలని కమిటీ నిర్ణయించింది. ఈద్ మిలాద్-ఉన్-నబీ సెప్టెంబర్ 16న వస్తుందని భావిస్తున్నందున, అదే రోజున హైదరాబాద్‌లో ఊరేగింపును కూడా నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆ రోజున సెలవు ప్రకటించినప్పటికీ, మిలాద్-ఉన్-నబీ యొక్క ఖచ్చితమైన తేదీని ఇంకా ధృవీకరించలేదు, ఎందుకంటే ఇది చంద్రుని దర్శనం మీద ఆధారపడి ఉంటుంది. ఇది మిలాద్-ఉన్-నబీ యొక్క 1500వ వార్షికోత్సవం కాబట్టి, ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. మిలాద్-ఉన్-నబీ రబీ అల్-అవ్వల్ 12న జరుపుకుంటారు, ఇది నెలవంక దర్శనాన్ని బట్టి సెప్టెంబర్ 16 లేదా 17న రావొచ్చు.

## మట్టిలో మాణిక్యాల క్రీడా ప్రతిభను వెలికి తీయాలి

### - జిల్లా కేంద్రాల్లో రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ సహకారం

### -స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి

### - మెదక్ లో తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ అథ్లెటిక్ పోటీలు ప్రారంభం

మెదక్ ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వివిధ జిల్లా కేంద్రాల్లో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల నిర్వహణ ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు స్ఫూర్తి లభిస్తుందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేన రెడ్డి అన్నారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉమెదక్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు మెదక్ జిల్లా కేంద్రం ఇందిరా గాంధీ స్టేడియం లో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి సీనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ (మెన్ & ఉమెన్ ) ప్రారంభోత్సవానికిముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ జాతీయ స్థాయి రాష్ట్ర స్థాయి పోటీలు కేవలం హైదరాబాదు నగరానికే పరిమితం కాకుండా ఆయా జిల్లాలలో పోటీల నిర్వహణ ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు స్ఫూర్తి కలుగుతుందని ఆయన అన్నారు. మట్టిలో మాణిక్యాలను గుర్తించాలంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం దక్కాలంటే మారుమూల ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణ ఎంతో దూరం చేస్తుందని ఆయన అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అనేక క్రీడా ప్రోత్సాహక విధానాలను అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి తెలంగాణ క్రీడా భవిష్యత్తుకు మంచి బాటలు వేశారని ఆయన వివరించారు. త్వరలో నూతన క్రీడా విధానం, స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పడం, అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మించడం, గోల్ఫ్ క్లబ్ ఏర్పాటు వివిధ జాతీయ అంతర్జాతీయ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే ఇప్పటివరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినంత బడ్జెట్ ను ఈసారి క్రీడలకు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని ప్రకటించిందని ఆయన అన్నారు. ఇటీవల ప్యారిస్ లో ముగిసిన ఒలంపిక్స్ లో మనము అనుకున్న ఫలితాలు రాబట్ట లేకపోయామని, నిరాశ చెందకుండా వచ్చే ఒలంపిక్స్ ను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా కృషి జరగాలని ఆయనకోరారు. ప్రతి క్రీడాకారు డు,కోచ్, క్రీడా సంఘాలు క్రీడా పరిపాలనా విభాగం అందరి లక్ష్యం వచ్చే ఒలంపిక్స్ లో తెలంగాణ నుండి రెండు అంకెల పతకాలు సాధించడం అనే అంశంపై దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు సారంగపాణి జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరమణ కార్యదర్శి మధుసూదన్ జిల్లా క్రీడా యువజన అభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి పి ఈ టి అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, వివిధ సంఘాల ప్రతినిధులు జుబేర్, ఎం ఎల్ ఎన్ రెడ్డి,మహేందర్ రెడ్డి శివ శంకర్ రావు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# జీరో మలేరియా భారతాన్ని నిర్మించగలమా !

## (20 ఆగష్టు "ప్రపంచ దోమల నివారణ దినం" సందర్భంగా)

నేడు దేశవ్యాప్తంగా మలేరియా, డెంగ్యూ లాంటి పలు సీజనల్ వ్యాధులుపట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా నమోదు అవుతున్నాయి. 145 కోట్ల జనాభా కలిగిన భారతదేశాన్ని పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, ఆరోగ్య సమస్యలు అనేక ఏండ్లుగా వెంటాడుతున్నాయి. జనాభా పెరుగుదలతో పేదరికం అధికమవుతూ ఆరోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయి. అవిద్య కారణంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత లోపించడంతో పలు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. వానాకాలంలో తొలకరి జల్లులతో పాటు దోమలు, ఈగలు లాంటి రోగకారక జీవులతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు తీవ్రంగా ప్రబలడం సర్వ సాధారణమని వైద్యాధికారులు వెల్లడిస్తారు. వానాకాలంలో మురికి నీటి నిల్వలతో దోమలు, లార్వాలు పెరగడంతో పాటు దోమ కాటు బారిన పడే జనుల అధికమవుతారు.

రొనాల్డ్ రోస్ పరిశోధనలు:

20 ఆగష్టు 1897న నోబెల్ బహుమతి (1902) గ్రహీత 'సర్ రొనాల్డ్ రోస్' చేసిన ఆవిష్కరణ ప్రకారం ఆడ "అనాఫిలిస్" దోమ కాటుతో మలేరియా వ్యాధి సంక్రమిస్తుందనే అతి ప్రధానమైన పరిశోధనా ఫలితాలను వివరించారు. మలేరియా వ్యాధి దోమకాటుతో సోకుతుందనే ప్రధాన ఆవిష్కరణను వివరించిన రోనాల్డ్ రోస్ ప్రకటన చేసిన రోజుకు గుర్తుగా ప్రతి ఏట 20 ఆగష్టున 'ప్రపంచ దోమల నివారణ దినం (వరల్డ్ మస్కిటో ఎరాడికేషన్ డే)' పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రపంచ దోమల నివారణ దినం-2024 థీమ్‌గా "ప్రపంచ సమానత్వ సాధనకు దోమల నివారణ వేగవంతం చేయడం" అనే అంశం తీసుకున్నారు. దోమ కాటుతో సంక్రమించే ప్రాణాంతక వ్యాధుల్లో మలేరియా అతి ముఖ్యమైనది. మలేరియా వ్యాధి బారిన పడుతున్న పేద ప్రజలు అధిక శాతం ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి ప్రమాదకర మలేరియా వ్యాధి పట్ల అవగాహన పెంచుకుందాం.

దోమ కాటుతో సోకే వ్యాధులు:

దోమ కాటుతో ప్రాణాంతక మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియాసిస్, యెల్లో ఫివర్, జీకా లాంటి వ్యాధులు సోకుతాయి. ఈగలతో సంక్రమించే వ్యాధుల్లో డిసెంట్రీ, డయేరియా, టైఫాయిడ్, కలరా, హెల్మెంథిస్ లాంటివి అంటుకుంటాయి. పూర్తిగా, సమర్థవంతంగా నివారించగల, వైద్యంతో సులభంగా నయం చేయగల మలేరియా రోగంతో ప్రతి ఏటా మిలియన్ల ప్రజలు బాధపడుతున్నారు . ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 219 మిలియన్ల మలేరియా కేసులు, కనీసం 4 లక్షల మలేరియా కారణ మరణాలు నమోదు అవుతున్నాయి.

మలేరియా వ్యాధి ప్రబలడం:

దోమకాటుతో సంక్రమించే మలేరియా వ్యాధి ఓ ప్రపంచ తీవ్ర ప్రాణాంతక సమస్యగా గుర్తించబడింది. ప్రపంచ మలేరియా కేసుల్లో సబ్-సహార ఆఫ్రికా దేశాల్లో మలేరియా కారణ మరణాలు (ముఖ్యంగా పిల్లలు, మహిళలు) 90 శాతం వరకు నమోదు అవుతున్నాయి. దోమకాటుతో వ్యాప్తి చెందగల మలేరియా వ్యాప్తికి వర్షాలు, నిలువ నీరు, వాతావరణ ఉష్ణోగ్రత, గాలిలో తేమ, అపరిశుభ్ర పరిసరాలు లాంటి కారణాలను చెప్పవచ్చు. మలేరియా సోకిన వ్యక్తిని కాటు వేసిన దోమలు తిరిగి ఆరోగ్యవంతులను కాటు వేయడంతో మలేరియా వ్యాధి ఆరోగ్యవంతులకు సంక్రమిస్తుంది. ఏకకణజీవి ప్లాస్మోడియం పరాన్నజీవి సోకిన వ్యక్తులకు మలేరియా రోగం వస్తుంది.

మలేరియా వ్యాధి లక్షణాలు:

మలేరియా సోకిన వ్యక్తులకు తలనొప్పి, చలిజ్వరం, కండరాల నొప్పి, శరీర నొప్పులు, సోమరితనం, నిస్సత్తువ లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. గర్భిణి స్త్రీలకు, గర్భంలోని శిశువు ఎదుగుదలకు మలేరియా అతి ప్రమాదకరమని తెలుసుకోవాలి. ఐదురకాల మలేరియా పరాన్నజీవుల్లో ప్లాస్మోడియం ఫాల్సిఫరమ్ పరాన్నజీవితో సంక్రమించే మలేరియా అత్యంత ప్రమాదకరమైనది. రోగి నుండి మరో ఆరోగ్యవంతుడికి నేరుగా మలేరియా సోకదు, కాని దోమకాటుతో మాత్రమే రోగం సోకుతుంది. సకాలంలో చికిత్స అందని యెడల వ్యాధి తీవ్రమై రక్తహీనత, జాండిస్, మెంటల్ కన్ఫ్యూజన్, కిడ్నీ ఫెయిల్యూర్, కోమాతో పాటు చివరకు మరణం కూడా కలగవచ్చు. రక్తంలో చేరిన పరాన్నజీవి కాలేయం, ఎర్ర రక్తకణాలను ప్రభావితం చేస్తుంది. మలేరియా సోకిన వ్యక్తికి సరైన వైద్యం సకాలంలో అందనియెడల ప్రాణం పోవడం ఖాయమని తెలుసుకోవాలి. మలేరియా పరాన్నజీవి శరీరంలోకి ప్రవేశించిన 7-18 రోజుల్లో రోగలక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో చికిత్స లభించని కేసుల్లో దీర్ఘకాలిక రోగాలు కలుగవచ్చని కూడా గమనించారు.

మలేరియా వ్యాధి నిర్ధారణ:

మలేరియా నిర్ధారణ పరీక్షగా రక్తంలో మలేరియా పరాన్నజీవి ఉనికిని తెలుసుకొనే 'మలేరియా రాపిడ్ డయాగ్నొస్టిక్ టెస్ట్' నిర్వహిస్తారు. మలేరియా వ్యాధి నిర్ధారణ అయిన తరువాత నయం చేయడానికి సమర్థవంతమైన ఆంటీ-మలేరియా ఔషధాలు ఇవ్వబడతాయి. విచక్షణ మరిచి మలేరియా ఔషధాలను వాడితే దుష్ప్రభావాలు అతి తీవ్రంగా ఉంటుంది. 2018 నుంచి మలేరియాకు ఆర్‌టియస్,యస్ టీకాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ టీకాలను మలేరియా అధికంగా వ్యాపిస్తున్న ప్రాంతాల్లో శిశువులకు, పిల్లలకు అందిస్తారు.

మలేరియా నివారణ మార్గాలు:

మలేరియా కారణ దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత, మురుగు నీరు నిలువ లేకుండా చూడడం, శరీర అవయవాలను పూర్తిగా కప్పుకునేలా దుస్తువులు ధరించడం, దోమ తెరలు వాడడం, దోమలను తరిమే ఆధునిక/సహజ మస్కిటో రిపెలెంట్స్ వాడడం, రోగ లక్షణాలను గమనించడం, సత్వరమే చికిత్స చేయించుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం లాంటి చర్యలు చేపట్టాలి. పలు వ్యాధుల నివారణకు కారణాలుగా సురక్షిత నీరు వాడడం, పరిసరాల/వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, అంటువ్యాధుల అవగాహనతో జాగ్రత్తగా ఉండడం లాంటి చర్యలు తీసుకోవాలి.

దోమలు, లార్వాలను నివారించడం, దోమకాటుకు గురికాకుండా జాగ్రత్త పడడం, సకాలంలో చికిత్స తీసుకోవడం లాంటి చర్యలతో మలేషియా కనిపించని (జీరో మలేరియా) ప్రపంచాన్ని నిర్మించుకుందాం.

- డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఫోటోగ్రాఫర్లు సమాజ చైతన్య అదృశ్య శక్తులు

**- కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి**




హైదరాబాద్, ఆగష్టు 19 :పౌర సమాజాన్ని చైతన్యపరుస్తూ, తమ అపూర్వ ఫోటోగ్రఫీ కళతో ప్రపంచానికి అమూల్య సేవలు చేస్తున్న ఫోటోగ్రాఫర్లకు కృతజ్ఞతలు తెలియజేయాల్సిన సందర్భంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేదికలు ఉపయోగపడుతున్నాయని లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షులు కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. తొలి నాటి కెమెరా నుంచి నేటి స్మార్ట్ ఫోన్ డిజిటల్ కెమెరా వరకు ఫోటోగ్రాఫర్ల పాత్ర ప్రాధాన్యతను కలిగి ఉందని, ఉత్తమ ఫోటోగ్రాఫర్లకు గౌరవం, ఆదాయం అధికంగా ఉన్నాయని అన్నారు. ఈ రోజు పద్మానగర్ మానేరు పాఠశాల ఆవరణలో లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, ప్రవాసీ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మరో అతిథి కడారి అనంత రెడ్డి మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లు ఎల్లవేళల తెర వెనుక శ్రమిస్తూ సమాజాభివృద్ధికి దోహదపడుతున్నారని, వారిలో దాగిన సృజనాత్మకతకు సలాం చేయాలని అన్నారు. సన్మాన గ్రహీతలు ప్రముఖ ఫోటోగ్రాఫర్లు గుంటపల్లి స్వామి, జయకృష్ణ, శ్రీనివాసాచార్యలు మాట్లాడుతూ ప్రపంచానికి వెలుగుల ఛాయాచిత్రాలు తీసే ఫోటోగ్రాఫర్ల వ్యక్తిగత జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయని అన్నారు. అవసరం తీరాక ఫోటోగ్రాఫర్లను నిర్లక్ష్యం చేసే పద్ధతి కొనసాగుతుండడం విచారకరమని, కెమెరాతో ముడిపడి సామాన్య స్థాయిలో జీవనోపాధిని పొందుతున్నామని అన్నారు. ఫోటోగ్రాఫర్లను సమాజంతో పాటు ప్రభుత్వాలు కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నగరానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్లు కె. జయకృష్ణ, ఉప్పు దామోదర్, సముద్రాల శ్రీనివాస్, ఎండి కుసూర్, ఏ. శైలేందర్ రెడ్డి, గుంటపల్లి స్వామి, ఆర్. కుమార స్వామి, జక్కుల భూమన్న, వి. శ్రీనివాస్, కె. శ్రీహరిలను ఘనంగా సన్మానించారు.

# చెన్నైలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త ఐసీజీ నావికా రక్షణ సమన్వయ కేంద్రాన్ని ప్రారంభించనున్న రక్షణ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 19: :రక్షణ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింగ్ 2024 ఆగస్టు 18న చెన్నైలో కొత్తగా నిర్మించిన అత్యాధునిక భారత తీరరక్షక దళం (ఐసీజీ) నావికా రక్షణ సమన్వయ కేంద్రం (ఎంఆర్ సీసీ) భవనాన్ని ప్రారంభించనున్నారు. మరో రెండు కీలక సదుపాయాలు ? చెన్నైలో ప్రాంతీయ సముద్ర కాలుష్య స్పందన కేంద్రం (ఆర్ఎంపీఆర్సీ), పాండిచ్చేరి లో తీర రక్షక దళ వాయు పరివేష్టిత విభాగాన్ని (సీజీఏఈ) కూడా ఆయన ప్రారంభిస్తారు.

ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర సంస్థలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు. సముద్ర భద్రతకీ, ప్రాంతీయ సమన్వయానికీ ఈ సందర్భం కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది. భారత తీరం వెంబడి సముద్ర భద్రత, అత్యవసర ప్రతిస్పందనలను మెరుగుపరిచే దిశగా ఇదొక ముందడుగు అవుతుంది.

చెన్నైలోని కొత్త ఎంఆర్ సీసీ ప్రతిష్ఠాత్మక నిర్మాణంగా నిలవనుంది. ఆపద సమయాల్లో నావికుల, మత్స్యకారుల కోసం తీసుకునే సహాయక చర్యల సమన్వయాన్ని మరింత ప్రభావవంతంగా నిర్వహించడానికి ఈ కేంద్రం తోడ్పడుతుంది. సముద్ర జలాల్లో ప్రాణ రక్షణ, క్లిష్ట సమయాల్లో సత్వర ప్రతిస్పందనకు భరోసా ఇవ్వడంలో ఐసీజీ ఈ అత్యాధునిక సదుపాయం ఉపయోగపడుతుంది.

చెన్నై నౌకాశ్రయ ఆవరణలో ఉన్న ఐసీజీ ప్రాంతీయ సముద్ర కాలుష్య స్పందన కేంద్రం (ఆర్ఎంపీఆర్సీ) సముద్ర కాలుష్య నిర్వహణలో ఒక గొప్ప ముందడుగు. ఈ ప్రాంతంలో ఏర్పాటైన కేంద్రం ఈ తరహా నిర్మాణాల్లో మొదటిది. ఆర్ఎంపీఆర్సీ సముద్ర కాలుష్య ఘటనలకు, ముఖ్యంగా తీర రాష్ట్రాల్లోని కోస్తా జలాల్లో చమురు, రసాయనాలు భారీగా కలిసిపోయినపుడు ఈ కేంద్రం తక్షణం స్పందిస్తుంది.

పుదుచ్చేరిలోని తీర రక్షక దళ వాయు పరివేష్టిత విభాగం (ఎయిర్ ఎన్ క్లేవ్) ఐసీజీకి ఒక కీలక విజయంగా చెప్పాలి. పుదుచ్చేరి, దక్షిణ తమిళనాడు తీరం వెంబడి సముద్ర భద్రతను బలోపేతం చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. అందులో చేతక్, అధునాతన తేలికపాటి హెలికాప్టర్ బృందాలు ఉంటాయి. వైమానిక నిఘాను, ప్రతిస్పందన సామర్థ్యాలను అది మెరుగుపరుస్తుంది.

పటిష్టమైన సముద్ర భద్రతకు భరోసా కల్పించడంలో, అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా ప్రతిస్పందించడంలో కీలక పాత్ర పోషించడానికి ఈ కొత్త సదుపాయాలు సిద్ధంగా ఉంటాయి.

# ఆర్థిక జాతీయవాదం ఒక 'స్వదేశీ' నమూనా, స్థానికత గళానికి ప్రతిబింబం: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆగష్టు 19: :ఆర్థిక జాతీయవాదాన్ని స్వీకరించాలని ఉపరాష్ట్రపతి శ్రీ జగదీప్ ధన్కర్ ఆగష్టు 17న దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. అనివార్యం కాని అంశాల్లో దిగుమతుల కన్నా స్థానిక ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని పారిశ్రామిక, వర్తక, వాణిజ్య రంగాలను కోరారు.

ఆర్థిక జాతీయవాదం 'స్వదేశీ'లోని ఒక పార్శ్వమని, స్థానికత కోసం గళమెత్తడానికి అది అద్దం పడుతుందని స్పష్టంచేశారు. విదేశీ మారకద్రవ్యం తగ్గిపోవడం, భారతీయ కార్మికులు ఉద్యోగావకాశాలను కోల్పోవడం సహా ఆర్థిక వ్యవస్థపై అనవసర దిగుమతుల ప్రతికూల ప్రభావాన్ని శ్రీ ధనకర్ ప్రముఖంగా ప్రస్తావించారు.

"కార్పెట్లు, దుస్తులు, బొమ్మల వంటి వస్తువుల కోసం దిగుమతులపై ఆధారపడడం వల్ల మన విదేశీ మారకద్రవ్యం విదేశాలకు తరలిపోవడమే కాకుండా, దేశీయ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వృద్ధికి ఆటంకం కలుగుతోంది" అని శ్రీ ధనకర్ వ్యాఖ్యానించారు. స్థానిక ఉత్పత్తులకు చేయూత ఇవ్వడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలని పారిశ్రామిక రంగానికి విజ్ఞప్తి చేశారు. అది భారతీయ కార్మికులకు పని కల్పించడంతో పాటు పారిశ్రామికోత్పత్తిని ప్రోత్సహిస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్టులో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తూ, సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాల్సిన ఆవశ్యకతను శ్రీ ధనకర్ స్పష్టంచేశారు. ఆర్థిక శక్తిని బట్టి కాకుండా, అవసరాన్ని బట్టి వనరులను ఉపయోగించుకోవాల్సిందిగా ప్రజలను కోరారు. ఆర్థికబల ప్రేరితమైన సహజవనరుల మితిమీరిన వినియోగం భవిష్యత్తు తరాలకు పెద్ద ముప్పుగా పరిణమిస్తుందని ఆయన ఉద్ఘాటించారు.

నిర్లక్ష్యపు ఖర్చులపై హెచ్చరిస్తూ, అలాంటి చర్యలు భవిష్యత్ తరాల శ్రేయస్సును దెబ్బతీస్తాయని ధనకర్ వ్యాఖ్యానించారు. "ధనబలంతో మనమిప్పుడు అనవసరంగా ఖర్చు చేస్తే, భవిష్యత్ తరాన్ని ప్రమాదంలోకి నెడుతున్నట్టే" అని ఆయన అన్నారు.

ముడి ఇనుము వంటి ముడి పదార్థాలను ఎలాంటి అదనపు విలువనూ జోడించకుండా ఎగుమతి చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం ఉపాధి అవకాశాల సామర్థ్యాన్ని తగ్గించడమే కాక, దేశ ఆర్థిక వ్యవస్థను కూడా బలహీనపరుస్తుందని శ్రీ ధనకర్ పేర్కొన్నారు. "అదనపు విలువ ఏదీ లేకుండా మన ఇనుప ఖనిజం ఓడరేవులను దాటి తరలిపోతుండడం అత్యంత బాధాకరం. దీర్ఘకాలిక జాతీయ ప్రయోజనాల కన్నా సులభమైన, సత్వర సంపాదనకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని ఒక దేశంగా మనం అంగీకరించలేము" అని శ్రీ ధనకర్ స్పష్టంచేశారు.

రాజకీయ, స్వీయ, ఆర్థిక ప్రయోజనాల కన్నా దేశ శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చేలా సమష్టి కృషి సాగాలని శ్రీ ధనకర్ పిలుపునిచ్చారు. మన మనస్తత్వంలో ఈ దిశగా మార్పు వస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

రుగ్వేదంలోని ఒక శ్లోకం "సంగచ్ఛధ్వం సంవదధ్వం సంవో"ను ఉటంకిస్తూ, "దేశం కోసం ఎల్లప్పుడూ కలసి ముందుకు సాగుదాం, ఒకేలా గొంతెత్తుదాం" అని శ్రీ ధనకర్ కోరారు. జాతీయ ఐక్యత ప్రాధాన్యాన్ని నొక్కిచెప్తూ "ఎప్పుడైనా సరే, అన్నిటికన్నా దేశానికే ప్రాధాన్యం ఇద్దాం" అని ఆయన అన్నారు. ఆశలు వదులుకున్న సాధారణ పౌరుల జీవితాల్లో వాస్తవికమైన మార్పును తీసుకువచ్చే స్పష్టమైన చర్యల తక్షణ ఆవశ్యకతను ఆయన పేర్కొన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ ఎం. వెంకయ్య నాయుడు పట్ల తన ప్రగాఢమైన అభిమానాన్నీ, గౌరవాన్నీ వ్యక్తం చేస్తూ, దేశ సంక్షేమం కోసం శ్రీ వెంకయ్య నాయుడు జీవితకాలం అంకితభావంతో కృషిచేశారని శ్రీ ధనకర్ ప్రముఖంగా పేర్కొన్నారు. ఆదర్శాలపై వెంకయ్య నాయుడుకు ఉన్న అచంచలమైన నిబద్ధత ఆయన ప్రజాజీవితాన్ని తీర్చిదిద్దిందన్నారు.

# సంస్కరించబడిన భారతీయ దేవ భాష సంస్కృతం - వేద భవనం ప్రాచార్యులు వర ప్రసాద్ ఆచార్య



హైదరాబాద్, ఆగష్టు 19 :ప్రపంచంలో అత్యంత పురాతనమైన దేవుళ్లు మాట్లాడే భాషగా భారతీయ సంస్కృత భాషకు పేరు ఉండడం, ప్రపంచవ్యాప్త భాషలకు పునాదిగా సంస్కృతానికి ప్రత్యేకత ఉందని కరీంనగర్ వేద పాఠశాల ప్రాచార్యులు వర ప్రసాదు ఆచార్య అన్నారు. ఈ రోజు తెలంగాణ తెలుగు భాషా సంఘం, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సంయుక్తంగా వేద భవనంలో నిర్వహించిన "ప్రపంచ సంస్కృత దినోత్సవ" వేడుకల్లో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ లోపాలేవీ లేని అతి పురాతన సంస్కృత భాష వేదాలు, ఇతిహాసాలు, పురాణాలకు పుట్టిల్లని అన్నారు. సభాధ్యక్షులు తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షులు కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా కె రామకృష్ణ మాట్లాడుతూ 3500 సంవత్సరాల పురాతన భారతీయ భాష అయినప్పటికీ ఆంగ్లం, గ్రీక్, లాటిన్ లాంటి ప్రపంచవ్యాప్త 876 భాషలకు పునాదిగా సంస్కృత భాష నిలుస్తున్నదని సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంస్కృత భాష స్పీచ్ థెరపీకి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వేద పాఠశాల విద్యార్థులు, భక్తుల సమక్షంలో సంస్కృత పండితులు శ్రీ వరప్రసాద్ ఆచార్య, శ్రీ సంతోష్ కృష్ణమాచార్య వేద పాఠశాల గురువులను బుర్ర జలజా రెడ్డి - కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భక్తులు పాఠశాల గురువులకు సంస్కృత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# మంకీపాక్స్ పరిస్థితి, సన్నద్ధతను సమీక్షించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జేపీ నడ్డా

న్యూఢిల్లీ, ఆగష్టు 19: :ప్రపంచ ఆరోగ్య సంస్థ 14 ఆగస్ట్ 2024 వ తేదీన మంకీపాక్స్ ను అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర స్థితిగా (పిహెచ్ఇఐసి) గా ప్రకటించిన దృష్ట్యా, దేశంలో మంకీపాక్స్ పరిస్థితి సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ప్రస్తుతం భారత్ లో ఇప్పటివరకు మంకీపాక్స్ కేసులు నమోదు కాలేదు.

మంకీపాక్స్ వైరస్ దేశంలోకి రాకుండా అడ్డుకట్టవేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తగా చర్యలను తీసుకుంటున్నది. అన్ని విమానాశ్రయాలు, ఓడరేవులు, దేశ సరిహద్దుల వద్ద ఆరోగ్య యూనిట్లను అప్రమత్తం చేయడం; పరీక్షా కేంద్రాలను (32 కేంద్రాలు) సిద్ధం చేయడం; ఏదైనా కేసును గుర్తించడానికి, ఐసోలేట్ చేయడానికి నిర్వహించాల్సిన సౌకర్యాలను సిద్ధం చేయడం ఇందులో ఉన్నాయి.

మంకీపాక్స్ దానికదే నెమ్మదిస్తుంది. సాధారణంగా 2-4 వారాల మధ్య దాని ప్రభావం ఉంటుంది. రోగులు సాధారణ జాగ్రత్తలతో కోలుకుంటారు. వ్యాధి ఉన్న వారితో దీర్ఘకాలిక సన్నిహిత సంబంధం కలిగి ఉండడం ద్వారా, లైంగిక సంబంధం ద్వారా, శరీరం/ గాయాలతో ప్రత్యక్ష సంబంధం లేదా సోకిన వ్యక్తి దుస్తుల ద్వారా ఇది వ్యాప్తి చెందుతుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ 2022 జూలైలో మంకీపాక్స్ ను అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యయిక స్థితి (పిహెచ్ఇఐసి) గా ప్రకటించింది. అనంతరం మే 2023 లో దానిని రద్దు చేసింది. ప్రపంచవ్యాప్తంగా 2022 నుండి, డబ్ల్యూహెచ్ఓ 116 దేశాల్లో ఈ మంకీ పాక్స్ వల్ల 99,176 కేసులు, 208 మరణాలు సంభవించినట్లు నివేదించింది. డబ్ల్యూహెచ్ఓ 2022 ప్రకటన తర్వాత భారతదేశంలో మొత్తం 30 కేసులు వచ్చాయి. చివరి కేసు 2024 మార్చిలో నమోదైంది.

మంకీపాక్స్ పరిస్థితిని సమీక్షించడానికి సంబంధిత రంగాల నిపుణులతో డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన 16 ఆగస్ట్ 2024 వ తేదీ జాయింట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశం జరిగింది. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రులు, ఎయిమ్స్ తదితర సంస్థల నిపుణులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాబోయే వారాల్లో విదేశాలనుంచి పలు కేసులు వచ్చే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చనప్పటికీ, వైరస్ వ్యాప్తి ప్రమాదం ప్రస్తుతం భారతదేశానికి తక్కువగా ఉందని అంచనా వేశారు.

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది.

# రక్షాబంధన్, శ్రావణ పౌర్ణమితో మీ ఇంట అన్ని శుభాలే-పవన్‌కల్యాణ్

అమరావతి, ఆగష్టు 19 :రక్షాబంధన్ సందర్భంగా మహిళాలోకానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక రక్షాబంధన్ పండుగ అని అన్నారు. కుటుంబ బాంధవ్యాలకు అధిక ప్రాధాన్యమిచ్చే మన భారతీయులకు శ్రావణ పౌర్ణమినాడు వచ్చే ఈ రాఖీ పండుగ ఒక ఆనందాల వేడుక అని వెల్లడించారు. ఈ పర్వదినం సందర్భంగా అక్కాచెల్లెళ్లు అందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పవన్ కల్యాణ్ ఓ ప్రకటన విడుదల చేశారు.

"సోదర సోదరి ప్రేమ అనుభవైకవేద్యంతోనే అర్థమవుతుంది. అక్కచెల్లమ్మల అనురాగానికి ఏమిస్తే రుణం తీరుతుంది.

విప్లవ కవి శ్రీగద్దరన్న పాడినట్లు చెల్లెలు పాదం మీద పుట్టుమచ్చగానో.. అక్క నుదుటున తిలకంగానో అలంకృతమైనప్పుడే ఆ రుణం తీరుతుందేమో..! అదేవిధంగా అన్నదమ్ముల ఆప్యాయతకు ఎవరు వెలకట్టగలరు..? వీరిని జీవితాంతం గుండెల్లో గుడికట్టి పూజించడం తప్ప..! అటువంటి అనురాగానికి ప్రతీకైన రక్షాబంధన్ పండుగ శుభతరుణాన సోదర సోదరీమణులందరికీ అనురాగపూర్వక శుభాకాంక్షలు. భారతీయ సంస్కృతితో భాగమైన ఈ వేడుకను శ్రావణ పౌర్ణమినాడు ప్రేమైక మనస్సులతో భారతీయులతో పాటు దక్షిణ, తూర్పు ఆసియా దేశాలలో వైభవంగా జరుపుకునే ఈ పండుగ చేసుకోవడం సోదర సోదరీమణుల అనురాగానికి ప్రతీక.

# బస్సును ఢీకొట్టిన వ్యాన్..10 మంది మృతి



లక్నో ఆగష్టు 18 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సును ఒక వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 10 మంది మరణించారు. 27 మంది గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్ లోని బులంద్‌షహర్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఆదివారం ఉదయం ఘజియాబాద్ నుంచి సంభాల్ వెళ్తున్న పికప్‌వ్యాన్ ప్రైవేట్ బస్సును ఢీకొట్టింది. బుదౌన్‌మీరట్ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 10 మంది మరణించగా, 27 మంది గాయపడ్డారు. వ్యాన్ పూర్తిగా ధ్వంసం కాగా, బస్సు ముందు భాగం దెబ్బతింది. మృతదేహాలను పోస్ట్‌మార్టమ్ కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులకు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు.

# శ్రీసిటీలో చంద్రబాబు బిజిబిజీ.. 15 కంపెనీలు ప్రారంభించిన చంద్రబాబు

**-ఏకకాలంలో 15 కంపెనీలు ప్రారంభించిన చంద్రబాబు**
**-మరో ఏడు సంస్థలకు శంకుస్థాపనలు**
**-రూ. 900 కోట్ల పెట్టుబడులు**
**-సుమారు మూడు వేల మందికి ఉద్యోగాలు**

అమరావతి, ఆగష్టు 19 : ఏపీ సీఎం చంద్రబాబు తిరుపతి జిల్లా శ్రీసిటీలో నేడు పర్యటించారు. పలు ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. . ఇక్కడ మొత్తం 15 సంస్థల కార్యకలాపాలను ఆయన ప్రారంభించిన ఆయన మరో ఏడు సంస్థల కార్యాలయాలకు శంకుస్థాపన చేశారు.

దక్షిణ కొరియాకు చెందిన ఎల్‌జికెమ్, ఇజ్రాయిల్‌కు చెందిన నియోలింక్, జపాన్‌కు చెందిన నైడిక్, ఓజెఐ ఇండియా ప్యాకేజ్, జర్మనీకి చెందిన బెల్ పరిశ్రమలతో పాటు భారతదేశానికి చెందిన అడ్మైర్, ఆటోడేటా, బాంబేకోటెడ్ స్పెషల్ స్టీల్స్, ఈప్యాక్, ఇఎస్ఎస్‌కెఏవై, ఎవర్‌షైన్, జేజీఐ, త్రినాత్, జెన్‌లెనిన్ సంస్థల కార్యాకలాపాలకు చంద్రబాబు నేడు శ్రీకారం చుట్టారు.. రూ. 900 కోట్ల రూపాయల పెట్టుబడులతో ఏర్పాటైన ఈ సంస్థల ద్వారా 2 వేల 740 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని చంద్రబాబు ప్రకటివంచారు.

ఇక చైనాకు చెందిన ఎన్‌జీసీ, బెల్జియంకు చెందిన వెర్మేరియన్, జపాన్‌కు చెందిన ఏజీ ఆండ్ పీ పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. ఇదే సందర్భంగా జపాన్‌కు చెందిన రెండు పరిశ్రమలు, యూఏఇ, సింగపూర్‌లతో పాటు భారతదేశానికి చెందిన ఒక్కో పరిశ్రమ ఏర్పాటుపై ఒప్పందాలు చేసుకున్నారు. వాటి పెట్టుబడుల విలువ 1,213కోట్ల రూపాయలుగా ప్రభుత్వం ప్రకటించింది.అనంతరం శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సీఈవోలతో జరిగిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వివరించారు.. ఎపి పారిశ్రామిక విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు ఎపి సిఎం .

# 26 నుంచి ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ..



అమరావతి, ఆగష్టు 19 :ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 05వ తేదీ వరకు విశాఖపట్టణం పోర్టు స్టేడియంలో జరిగే ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి పక్కా ఏర్పాట్లు చేయాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/ స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్మన్ కోసం జరిగే ర్యాలీ విజయవంతంగా సాగేందుకు అధికారులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీ నిర్వహణకు సంబంధించి ఆర్మీ, జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం కలెక్టర్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అక్కయ్యపాలెం వద్ద గల పోర్ట్ ట్రస్ట్ డైమండ్ జూబ్లీ స్టేడియంలో ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన యువత పాల్గొనున్నారని పేర్కొన్నారు. స్టేడియం వద్ద తాగునీరు, పారిశుద్ధ్యం, లైటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, మొబైల్ టాయిలెట్స్, డస్ట్ బిన్స్ ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు. అభ్యర్థులు వేచి ఉండేందుకు మూడు హాళ్ళు, రిజిస్ట్రేషన్, వైద్య పరీక్షలు నిర్వహించుకునేందుకు వీలుగా ఆరు హాళ్లను, అవసరమైన ఫర్నీచర్, పెడస్టల్ ఫ్యాన్స్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పటిష్ట బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలు చేపట్టాలని డీసీపీకి చెప్పారు. బారికేడింగ్, ట్రాక్, ఎంక్లోజర్స్, ర్యాలీకి అవసరమైన స్టాండులను ఏర్పాటు చేయాలని ఆర్ ఉ బి అధికారులకు సూచించారు.

వైద్య బృందాలను, రెండు అంబులెన్సులను, అవసరమైన వైద్యులు, సిబ్బంది, మందులతో పాటు దగ్గరలో ఆసుపత్రి ఉండేలా ఏర్పాట్లు చేయాలని వైద్యాధికారులకు చెప్పారు. ర్యాలీకి సంబంధించి విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. అనౌన్స్మెంట్ వద్ద హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషా పరిజ్ఞానం కలిగిన ఉపాధ్యాయులను నియమించాలని సూచించారు. కోచ్లను అందుబాటులో ఉంచాలని డీఎస్డీఓను, వేదిక వద్ద అగ్నిమాపక యంత్రాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డీఎఫ్ఓను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, రెండు జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఈపీడీసీఎల్ అధికారులకు చెప్పారు. హైస్పీడ్ ఇంటర్నెట్, ప్రింటర్లు, ల్యాప్టాపులు, కంప్యూటర్లు ఇతర సామాగ్రి సమకూర్చాలని డీఐఓకు సూచించారు. అల్పాహారం, భోజన ఏర్పాట్లను చేయాలని డీఎస్వోకు చెప్పారు. ప్రతి అధికారికీ అప్పగించిన విధులను బాధ్యతగా వ్యవహరించి ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి మేజర్ శశాంక్, డీఆర్వో కె. మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏడీసీపీ, ఏసీపీ, ఇతర పోలీసు అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆర్టీసి త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్ ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ ఆర్టిసి త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశ పెట్టబోతోంది. ముందుగా ఈ ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులను కరీంనగర్-హైదరాబాద్, నిజామాబాద్ -హైదరాబాద్ మార్గాలలో నడపాలని ఆర్టిసి నిర్ణయించింది. ఈ-సూపర్ లగ్జరీ పేరుతో తీసుకు రానున్న ఈ బస్సులు ఇప్పటికే కరీంనగర్ డిపోకు 35, నిజామాబాద్ డిపోకు 13 బస్సులు చేరుకున్నాయి. ఈ బస్సులను ఆర్టిసి ప్రైవేట్ సంస్థ నుండి అద్దెకు తీసుకుంది. అయితే ఇప్పటికే హైదరాబాద్ లో సిటీ బస్సులుగా, హైదరాబాద్-విజయవాడ మధ్య అంతరాష్ట్ర సర్వీసులుగా ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టిసి నడిపిస్తోంది. ఈవన్నీ మెట్రో డీలక్స్ బస్సులు కాగా ప్రస్తుతం సూపర్ లగ్జరీ బస్సులను నడిపించబోతున్నారు. త్వరలోనే ఈ ఎలక్ట్రిక్ బస్సులను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. ఆర్టిసిలో కాలం చెల్లిన బస్సులు ఎక్కువగా ఉండటంతో వీటి నిర్వహణకే అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అటు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొత్త బస్సులు కూడా కొనుగోలు చేయలేక పోతోంది. ఈ బస్సుల్లో డ్రైవర్లుగా బస్సు తయారీదారు సిబ్బందే ఉండగా, కండక్టర్లుగా మాత్రం ఆర్టిసి సిబ్బంది ఉంటారు.

# వైభవంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ..



అమరావతి, ఆగష్టు 19 :విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిప్రదక్షిణ వైభవంగా కొనసాగింది. పౌర్ణమి సందర్భముగా సోమవారం ఉదయం లోకకళ్యాణార్థం, భక్త జనశ్రేయస్సు కొరకు, ధర్మప్రచారం నిమిత్తం వేదపండితుల మంత్రోచ్చరణలు, అమ్మవారి నామ స్మరణలు, మంగళ వాయిద్యముల నడుమ శ్రీ కామధేను అమ్మవారి ఆలయం (ఘాట్ రోడ్ ఎంట్రన్స్ వద్ద) వద్ద శ్రీ స్వామి, అమ్మవార్లుకు ఆలయ వైదిక సిబ్బందిచే శాస్త్రోక్తముగా పూజలు నిర్వహించి, ఆలయ ఈవో కె ఎస్ రామరావు కొబ్బరి కాయ కొట్టి గిరిప్రదక్షిణ కార్యక్రమంను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు విశేషముగా పాల్గొన్నారు. గిరిప్రదక్షిణ కార్యక్రమము శ్రీ కామధేను అమ్మవారి ఆలయము, కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్థంబాల సెంటర్, సితార, కబేలా, పాల ఫ్యాక్టరీ, చిట్టి నగర్, కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, ఘాట్ రోడ్ మీదుగా డప్పులు, బేతాల నృత్యములు తదితర సాంస్కృతిక కార్యక్రమముల నడుమ తిరిగి ఆలయమునకు చేరుకున్నారు.

గిరిప్రదక్షిణ మార్గంలో భక్తులు ప్రచార రథములో కొలువై ఉన్న శ్రీ అమ్మవారు, స్వామి వార్లకు భక్తిశ్రద్దలతో పూలు, పండ్లు, కొబ్బరికాయ లు సమర్పించి, పూజలు చేసి, అమ్మవారిని, స్వామి వారిని ప్రార్ధించి, అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. అమ్మవారి శిఖరం చుట్టూ పౌర్ణమి రోజున నిర్వహించే గిరి ప్రదక్షిణ చేస్తే భక్తుల కోరికలు త్వరగా తీరుతాయని ప్రతీతి. సుమారు ఏడు కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ కొనసాగింది.

# అవయవ దానం మనిషి స్వభావానికి అత్యుత్తమ నైతిక ఉదాహరణ

## -ఉప రాష్ట్రపతి అవయవ దానాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలన్న ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆగష్టు 19: :అవయవదానం ప్రాధాన్యత గురించి ఉప రాష్ట్రపతి శ్రీ ధన్ ఖర్ మాట్లాడుతూ "అవయవదానం ఆధ్యాత్మికం, మానవ స్వభావానికి అత్యుత్తమ నైతిక ఉదాహరణ" గా ఆయన అభివర్ణించారు. అవయవదానం సాధారణ దాతృత్వానికి మించినదకీ, కరుణ, నిస్వార్థం అనే గొప్ప సుగుణాలను ప్రతిఫలిస్తుందని ఆయన నొక్కి చెప్పారు.

జైపూర్ కు చెందిన జైన్ సోషల్ గ్రూప్స్ ( జెఎస్ జి) కేంద్ర కార్యాలయం, ఢిల్లీలోని దధీచి దేహ్ దాన్ సమితి జైపూర్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవయవ దానం చేసిన వారి కుటుంబాలను సత్కరించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. అవయవాల దానాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలనీ, మానవాళికి సేవ చేసే అత్యుత్తమ సంప్రదాయంగా దీనిని చూడాలని ఆయన కోరారు.

ప్రపంచ అవయవదాన దిన స్ఫూర్తిని గుర్తు చేస్తూ "ఇతరుల జీవితాల్లో మీరు చిరునవ్వులు పూయించండి" అని ఆకాంక్షించారు. ఈ అత్యుత్తమ సేవకు వ్యక్తిగతంగా, కుటుంబపరంగా అందరూ నిబద్ధతను కలిగి ఉండాలంటూ అందరినీ ప్రోత్సహించారు. "ఇదం శరీరం పరమార్థ సాధనమ్" అన్న ఆర్యోక్తిని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒక గొప్ప పని చేయడానికి మానవ దేహం ఎలా ఉపయోగపడుతున్నదీ స్పష్టం చేశారు. విస్తృత సామాజిక సంక్షేమానికి మానవ దేహం ఉపకరిస్తుందని తెలిపారు.

సమాజ హితం కోసం పనిచేయగలిగిన తెలివితేటలు ఉన్న యువకులున్నారని, వారికి అవసరమైన అవయవాలు లేక వారు అనుకున్న పనులు చేయలేకపోతున్నార చెబుతూ "మీరు వారికి సాయం చేస్తే, వారు సమాజానికి భారం కాకుండా, సమజానికి వరంగా మారతారు" అని ఉప రాష్ట్రపతి సూచించారు.

అవయవదానంలో పెరుగుతున్న వ్యాపార ధోరణిని ప్రస్తావిస్తూ, దానిని వైరస్ మహమ్మారితో పోల్చారు ఉప రాష్ట్రపతి.

వ్యాపార దృష్టితో కాకుండా సామాజిక హిత దృష్టితో అవయవదానం చేయాలని శ్రీ ధన్ ఖర్ మార్గనిర్దేశం చేశారు. వైద్యవృత్తిని దైవ కార్యంగా అభివర్ణిస్తూ, కోవిడ్ సమయంలో ఆరోగ్య సిబ్బంది చేసిన నిస్వార్థ సేవలను గుర్తు చేశారు. కానీ, ఆరోగ్య రంగానికి చెందిన కొంతమంది స్వార్థపరుల కారణంగా అవయవదానానికి ఉన్న గొప్పదనం తెలియకుండా పోతోందన్నారు. బలహీనతలను ఆధారంగా చేసుకుని మోసపూరిత వ్యాపారం చేసే వారికి అవయవ దానం ఒక అవకాశంగా ఉండటాన్ని అనుమతించరాదని సూచించారు.

నిస్వార్థ సేవకూ, త్యాగానికీ నిలయమైన భారత దేశపు చరిత్ర, సంస్కృతులను గుర్తు చేశారు. వేదాలు, ప్రాచీన గ్రంథాల్లోని జ్ఞానానీ, దార్శనికతనూ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని హితవు పలికారు.

భిన్నాభిప్రాయాలు ఉండటం ప్రజాస్వామ్య లక్షణమని, అయితే ఈ విభేదాల కోసం దేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టకూడదని అన్నారు. గతంలో అత్యయిక పరిస్థితిని విధించిన సమయంలో ప్రజాస్వామ్యానికి ఏర్పడిన ప్రమాదాల గురించి యువతరంలో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

కార్పొరేట్ సంస్థలు, వాణిజ్య సంఘాలు, వ్యాపారవేత్తలు స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అత్యంత అవసరమయ్యే వస్తువులను మాత్రమే దిగుమతి చేసుకోవాలని శ్రీ ధన్ ఖర్ తన ప్రసంగంలో సూచించారు.

# కోలకత్తాలో వైద్య కళాశాల విద్యార్థిని హత్యపై సమగ్ర విచారణ జరుపాలి

**- దుండగులను కఠినంగా శిక్షించాలి...**

**-బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఎన్.నిర్మల ముదిరాజ్**

హైదరాబాద్ ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కలకత్తా రాష్ట్రంలో ట్రైనీ వైద్య విద్యార్థినీపై అత్యాచారం చేసి హత్యచేసిన ఘటనపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి చే సమగ్ర విచారణ జరిపి,దోషులను కఠినంగా శిక్షించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఎన్.నిర్మల ముదిరాజ్ కేంద్ర ప్రభుత్వాన్ని,పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందార్భంగా ఎన్.నిర్మల ముదిరాజ్ మాట్లాడుతూ... 78 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో ప్రభుత్వాలు నేటికి విద్యార్థినిలకు, మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో మద్యం, డ్రగ్స్,, అశ్లీల చిత్రాలు ,బూతు సాహిత్యాల ను పూర్తిస్థాయిలో అరికట్టకుండా దిశా, నిర్భయ లాంటి చట్టాలెన్ని తెచ్చిన ఉపయోగం ఏమిటని పాలకులను ప్రశ్నించారు.?తక్షణమే పాలకులు స్పందించి అర్జీ కార్ ఘటనకు కారకులైన దుండగులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి, కఠినంగా శిక్షించాలని, వైద్య విద్యార్థిని కుటుంబాన్ని అక్కడి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆఫీసులో, ఇతర అన్ని ప్రదేశాలలో పనిచేస్తున్న మహిళలకు పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఒక మహిళా ముఖ్యమంత్రి ఐయుండి కుడా రాష్ట్రము లో ఇలాంటి దారురునాలు జరుగత సిగ్గుచేటన్నారు.

# బాధ్యతతో..ఉపాధి కల్పన

**-23న గ్రామ సభలు నిర్వహించండి**

**-పంచాయితీ రాజ్ అధికారులకు పవన్ ఆదేశం**

**-అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్**

**-గ్రామీణ ఉపాధిపై దృష్టి పెట్టాలన్న ఉపముఖ్యమంత్రి**



అమరావతి, ఆగష్టు 19 : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల పంచాయితీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం గ్రామ సభల నిర్వహణ, అందుకు సంబంధించిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 23వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ పథకం పథకం పరిధిలో 46 రకాలైన పనులు చేపట్టవచ్చని చెప్పారు.

ఈ పథకం ద్వారా రూ. వేల కోట్లు నిధులు వెచ్చిస్తున్నాం అని పేర్కొన్నారు. ప్రతీ రూపాయిని బాధ్యతతో వ్యయం చేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకం లక్ష్యం అందుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి, మండల, గ్రామ స్థాయిలో ఉన్న అధికారులు ఈ పథకం పనులు అమలులో బాధ్యత తీసుకోవాలని సూచించారు. సోషల్ ఆడిట్ విభాగం పకడ్బందీగా వ్యవహరించాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సచివాలయం నుంచి పి.ఆర్. ఆర్.డి. ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 26 జిల్లాల నుంచి జడ్పీ సీఈవోలు, డి.పి.ఓ.లు, డ్వామా పీడీలు, మండలాల్లో ఎంపీడీఓలు, ఈవో పిఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఏపీఓలు పాల్గొన్నారు.

# ఎంపాక్స్ పై సన్నద్ధతను సమీక్షించడానికి ప్రధాన మంత్రి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె. మిశ్రా అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 19: :ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సలహా మేరకు ప్రధాన మంత్రి ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి.కె.మిశ్రా అధ్యక్షతన దేశంలో ఎంపాక్స్ సంసిద్ధత స్థితి, సంబంధిత ప్రజారోగ్య చర్యలను సమీక్షించడానికి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.

ఆఫ్రికాలోని అనేక ప్రాంతాల్లో ప్రబలిన ఎం పాక్స్ వ్యాప్తి దృష్ట్యా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగస్ట్ 14న మరోసారి అంతర్జాతీయ ఎం పాక్స్ ప్రజా అనారోగ్య అత్యవసర స్థితిని ప్రకటించడం గమనార్హం. డబ్ల్యూహెచ్ఓ ఇంతకు ముందు చేసిన ప్రకటన ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 2022 నుంచి 116 దేశాల్లో 99,176 కేసులు, 208 మరణాలు ఎంపాక్స్ కారణంగా నమోదయ్యాయి. అనంతరం కాంగోలో ఎం పాక్స్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని నివేదించింది. గతేడాది కేసులు భారీగా నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటికే గతేడాది మొత్తం కన్నా ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ఈసారి 15,600 కేసులు నమోదు కాగా, 537 మంది ప్రాణాలు కోల్పోయారు. డబ్ల్యూహెచ్ఓ 2022లో అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి ప్రకటన చేసినప్పటి నుంచి భారత్ లో 30 కేసులు నమోదయ్యాయి. చివరి ఎంపాక్స్ కేసును గత మార్చిలో గుర్తించారు.

ప్రస్తుతానికి దేశంలో ఎంపాక్స్ కేసులు నమోదు కాలేదని ఉన్నతస్థాయి సమావేశంలో వెల్లడించారు. ప్రస్తుత అంచనా ప్రకారం, విస్తృతంగా ప్రబలుతున్న ఈ వ్యాధి నిరంతర వ్యాప్తి తక్కువగా ఉంది.

ఎంపాక్స్ వ్యాధికి కారకమయ్యే సూక్ష్మ క్రిములు ఒక స్వీయ పరిమితికి లోబడి చలిస్తాయి. వీటి జీవన కాల పరిమితి సాధారణంగా 2-4 వారాల మధ్య ఉంటుందని ప్రధాన మంత్రి ప్రధాన కార్యదర్శికి నిపుణులు తెలిపారు. ఎంపాక్స్ వ్యాధిగ్రస్తులు సాధారణంగా సహాయక వైద్య సంరక్షణతో కోలుకుంటారు. వ్యాధిగ్రస్తుడితో దీర్ఘకాలిక, సన్నిహిత సంబంధం ద్వారా ఎంపాక్స్ వ్యాపిస్తుంది. ఎక్కువగా లైంగిక మార్గం ద్వారా, రోగి శరీరం / గాయపడిన ప్రాంతాల నుంచి వెలువడే ద్రవాల ద్వారా లేదా ఆ వ్యాధి సోకిన వ్యక్తి దుస్తులు/వస్త్రాల ద్వారా ఇది ప్రబలుతోంది. గత వారం రోజుల్లో ఈ కింది చర్యలు తీసుకున్నట్లు ఆరోగ్య కార్యదర్శి తెలియజేశారు.

దేశంలో ప్రమాదాన్ని అంచనా వేయడానికి జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్సీడీసీ) ఆగస్టు 12న నిపుణుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఎన్సీడీసీ గతంలో జారీచేసిన అంటువ్యాధి హెచ్చరికను నవీకరించి కొత్త పరిణామాలను పరిశీలిస్తున్నారు.

అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఆరోగ్య బృందాలకు అవగాహన కల్పించారు.

సోమవారం ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ (డిజిహెచ్ఎస్) నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో 200 మందికి పైగా పాల్గొన్నారు. రాష్ట్రాల్లోని సమీకృత వ్యాధి నిఘా కార్యక్రమ (ఐడీఎస్పీ) విభాగాలు, ప్రవేశ నౌకాశ్రయాలతో పాటు రాష్ట్ర స్థాయి ఆరోగ్య అధికారులకు ఈ విషయంపై అవగాహన కల్పించారు.

నిఘా పెంచాలని, కేసులను సత్వరమే గుర్తించేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె. మిశ్రా ఆదేశించారు. ముందస్తు రోగ నిర్ధారణ కోసం పరీక్ష ప్రయోగశాలల యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం 32 ప్రయోగశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి నివారణ, చికిత్సకు సంబంధించిన ప్రోటోకాల్లను భారీగా ప్రచారం చేయాలని డాక్టర్ పి.కె. మిశ్రా ఆదేశించారు. వ్యాధి సంకేతాలు, లక్షణాలపై ఆరోగ్య సంరక్షకుల్లో అవగాహన కల్పించాలని, నిఘా వ్యవస్థకు సకాలంలో సమాచారం అందించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టంచేశారు.

ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యుడు డా. వి.కె. పాల్, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ కార్యదర్శి శ్రీ అపూర్వచంద్ర, ఆరోగ్య పరిశోధన కార్యదర్శి డా. రాజీవ్ బహల్, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సభ్య కార్యదర్శి శ్రీ కృష్ణ ఎస్ వత్స, సమాచార ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, హోంశాఖ కార్యదర్శి శ్రీ గోవింద మోహన్, ఇతర మంత్రిత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీలోకి జార్ఖండ్ మాజీ సీఎం చంపాయ్ సోరెన్..!

జార్ఖండ్ ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జార్ఖండ్లో అసెంబ్లీ ఎన్నికల ముందు కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. జార్ఖండ్ మాజీ సీఎం చంపాయ్ సోరెన్ బీజేపీలో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. చంపాయ్తోపాటు పలువురు జార్ఖండ్ ముక్తి మోర్చా ఎమ్మెల్యేలు కూడా బీజేపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు చంపాయ్ బృందం ఢిల్లీకి చేరుకుంది. ఈ రోజే కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో చంపాయ్ బీజేపీలో చేరతారనే టాక్ వినిపిస్తోంది. చంపాయ్ సోరెన్ ఇవాళ తన అధికారిక ఎక్స్ ప్రొఫైల్ నుంచి ను తొలగించడం కూడా ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. కాగా జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ఇటీవల మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యారు. దాంతో హేమంత్ సీఎం పదవికి రాజీనామా చేసి, చంపాయ్ సోరెన్ను సీఎంగా నియమించారు. జూన్ 28న బెయిల్పై జైలు నుంచి వచ్చిన హేమంత్ సోరెన్.. చంపాయ్ నుంచి మళ్లీ సీఎంగా బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి జేఎంఎం పార్టీకి చంపాయ్ సోరెన్ దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన బీజేపీలో చేరేందుకు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఇవాళ ఆయన ఏకంగా ఢిల్లీకి వెళ్లడం, తన ఎక్స్ ఖాతా నుంచి జేఎంఎంను తొలగించడం ఆ వార్తలకు బలం చేకూరుస్తున్నాయి.

# పశ్చిమ బెంగాల్లో వెంటనే రాష్ట్రపతి పాలన అమలు చెయ్యాలి

## -ధర్మ చక్రం అధ్యక్షురాలు యామినీ లక్ష్మి డిమాండ్

హైదరాబాద్ ఆగష్టు 19(ఎక్స్ ప్రెస్ న్యూస్ )పశ్చిమ బెంగాల్ లో వెంటనే రాష్ట్రపతి పాలన అమలు చెయ్యాలని మమతా బెనర్జీ సిఎం పదవికి ఏ విధంగాను అర్హురాలు కాదు.. వెంటనే ఆమె సిఎం పదవి నుండి నుండి దిగిపోవాలని డిమాండ్ చేసారు. కోల్కత్త లో ఆగష్టు 9 న జరిగిన మహిళా మెడికో అత్యా చారం అత్యంత దారుణం.. కోల్కత్త లోని ఆర్ జీకర్ హాస్పిటల్ సెమినార్ రూమ్ లో ఈ పాశవిక చర్య జరగడం.. అక్కడ ఎవరికీ తెలియకపోవడం ఆశ్చర్యంగా వుంది. ఆ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, ఇంకా మెడికో స్టూడెంట్స్ అక్కడ ఎవరికీ తెలియకుండా డ్రగ్స్, మెడికల్ మాఫియా, హ్యూమన్ ఆర్గాన్స్ ట్రాన్స్ఫర్ లాంటివి అక్కడ జరుగుతున్నాయని చనిపోవడానికి ముందు ఒక ఫోన్ కాల్ లో తన ఫ్రెండ్ కీ చెప్పడం జరిగింది.. తరువాత అక్కడే హాస్పిటల్ లో వున్న ఇతర స్టూడెంట్స్ తో డిస్కషన్ జరిగిన తరువాతనే ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. ఇంకా ఆశ్చర్యం ఏంటంటే మమత బెనర్జీ ఒక ముఖ్య మంత్రి, హోమ్ మినిస్టర్, హెల్త్ మినిస్టర్ కూడా ఆమెనే.. ఉండి ఒక వందమంది టిఎంసి గుండాలతో ర్యాలీ, ప్రొటెస్ట్ చేయించడం ఏంటి? అక్కడ సాక్ష్యాదారాలు లేకుండా చేయడం కోసమే ఈ కుట్ర.. అసలు నిర్భయ, దిశ లాంటి చట్టాలు వున్నా కూడా మహిళల పై ఆగాయిత్యాలు జరుగుతున్నాయి అంటే శిక్ష సరిగ్గా లేదని అర్థం.. శిక్ష ఎలా ఉండాలి అంటే దోషిని నడి రోడ్డులో చిత్రహింసలు పెట్టి చంపాలి.. ఎవడైనా మద్యం మత్తులో వున్నా కూడా ఆ శిక్ష గుర్తుకు రావాలి.. ఆ విధంగా చట్టం తీసుకురావాలని ధర్మ చక్రం అధ్యక్షురాలు యామినీ లక్ష్మి తెలియచేశారు.. అసలు దేశ ప్రధాన మంత్రి, ఇంకా ఇతర మహిళా మంత్రులు, ఇతర మంత్రులు స్పందించక పోవడం బాధాకరం అని, పశ్చిమ బెంగాల్ లో వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని చెప్పారు.

**కదులుతున్న బస్సులో బాలికపై సామూహిక అత్యాచారం**

ఉత్తరాఖండ్ ఆగష్టు 18 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కదులుతున్న బస్సులో బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. దిక్కుతోచని స్థితిలో కనిపించిన ఆమెను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కాపాడింది. ఫిర్యాదు అందుకున్న పోలీస్లు బస్సు డ్రైవర్, కండక్టర్తోసహా కొందరిని అరెస్ట్ చేశారు. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్లో ఈ సంఘటన జరిగింది. పంజాబ్కు చెందిన మైనర్ బాలిక దేశ రాజధాని ఢిల్లీ నుంచి డెహ్రాడూన్కు ఉత్తరాఖండ్ రోడ్వేస్ బస్సులో ప్రయాణించింది. ఆగస్ట్ 12,13 మధ్య రాత్రివేళ కదులుతున్న బస్సులో ఆ బాలికపై సామూహిక లైంగిక దాడి జరిగింది. అయితే మానసిక వికలాంగురాలిగా కనిపించిన ఆ బాలిక డెహ్రాడూన్ లోని ఇంటర్స్టేట్ బస్ టెర్మినల్ వద్ద దిక్కుతోచని స్థితిలోఉన్నదని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్లుసి) సూపర్వైజర్ సరోజిని తెలిపారు. 13 వ తేదీ తెల్లవారు జామున 2.30 గంటల సమయంలో ఆ బాలికను గుర్తించి సంక్షేమ కేంద్రానికి తరలించినట్టు చెప్పారు. ఆమెపై సామూహిక అత్యాచారం జరిగినట్టు తెలుసుకుని పోలీస్లకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు.

# ప్రజావాణి కార్యక్రమంతో ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చేయాలి.

## - జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.

సంగారెడ్డి ఆగష్టు 19(నేటి నిజం ప్రతినిధి) సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో



జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన23 మంది దరఖాస్తు చేసుకున్నారని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజావాణి కార్యక్రమంలో 23 అర్జీలు రాగా రెవిన్యూ 12 ,సెర్వే ల్యాండ్ రికార్డ్ 01, పంచాయతీరాజ్ 03 , మునిసిపల్ శాఖ 05 , వ్యవసాయశాఖ 02 వచ్చాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కారం చేయాలని సూచించారు.

ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు . ప్రజల సమస్యల పరిష్కరించడంలో అలసత్వం వహించవద్దని ఆదేశించారు .ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాని జిల్లా అధికారులకు షోకాస్ నోట్ జారీ చేయాలని ఏవో పరమేష్ ను ఆదేశించారు

ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్ , సంగారెడ్డి ఆర్ డి ఓ వసంత కుమారి , జిల్లా అధికారులు సాయిబాబా ,జగదీష్ ,నరసింహ , అఖిలేష్ రెడ్డి , జడ్పీసీఈఓ జానకిరామ్ , డి ఎం ఉహెచ్ ఓ గాయత్రీదేవి , సంబంధిత జిల్లాధికారులు , ఏవో పరమేష్ , తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ ఆహారంలో మైక్రోప్లాస్టిక్ కాలుష్య పరిష్కారానికి ప్రాజెక్టును ప్రారంభించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు విధానాల రూపకల్పన

న్యూఢిల్లీ, ఆగస్టు 19: :ఆహారంలో పెరుగుతున్న మైక్రోప్లాస్టిక్ కాలుష్యంపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ సమస్యను పరిష్కరించడానికి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆగస్టు 18న న్యూఢిల్లీలో ఒక కొత్త ప్రాజెక్టును ప్రారంభించింది. మైక్రోప్లాస్టిక్ కాలుష్యం ముంచుకొస్తున్న ముప్పుగా పరిణమిస్తోందని, దీనిపై తక్షణం దృష్టిసారించాల్సిన అవసరం ఉందని గుర్తించారు. "సూక్ష్మ, నానో-ప్లాస్టిక్ పదార్థాలు కొత్త ఆహార కలుషితాలు: ధృవీకరించే పద్ధతులను రూపొందించడం, వివిధ ఆహార మిశ్రమాల్లో ప్రాబల్యాన్ని అర్థం చేసుకోవడం"? ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇది ఈ ఏడాది మార్చిలో ప్రారంభమైంది. వివిధ ఆహార ఉత్పత్తులలో సూక్ష్మ, నానో-ప్లాస్టిక్‌లను గుర్తించడానికి తగు విశ్లేషణాత్మక పద్ధతులు ప్రామాణీకరించడానికీ, అభివృద్ధి చేయడానికీ ఉద్దేశించినది.

సూక్ష్మ/నానో-ప్లాస్టిక్ కాలుష్య విశ్లేషణ కోసం ప్రామాణిక పద్ధతులను అభివృద్ధి చేయడం ప్రాజెక్ట్ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటి. ఇంట్రా, ఇంటర్-లాబొరేటరీ తారతమ్యాలను గుర్తించడం, మైక్రోప్లాస్టిక్ కాలుష్య ప్రభావం వినియోగదారులపై ఏ మేరకు ఉందన్న కీలక సమాచారాన్ని సేకరిస్తారు. సిఎస్ఐఆర్-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టాక్సికాలజీ రీసెర్చ్ (లక్నో), ఐసిఏఆర్-సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (కొచ్చి), బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (పిలానీ) సహా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పరిశోధనా సంస్థల సహకారంతో ఈ అధ్యయనం జరుగుతోంది.

ఇటీవల ఓ నివేదికలో చక్కెర, ఉప్పు వంటి సాధారణ ఆహార పదార్థాలలో మైక్రోప్లాస్టిక్‌ల ఉనికిని ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) ప్రముఖంగా ప్రస్తావించింది. మైక్రోప్లాస్టిక్‌ల ప్రపంచవ్యాప్త ప్రాబల్యాన్ని నివేదిక నొక్కిచెప్పినప్పటికీ, ముఖ్యంగా భారతీయ సందర్భంలో మానవ ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన చిక్కులను పూర్తిగా అర్థం చేసుకోవడానికి మరింత సమాచారం అవసరమని స్పష్టం చేసింది.

ఆహార భద్రత నియంత్రిత సంస్థగా, ఎఫ్ఎస్ఎస్ఏఐ భారతీయ వినియోగదారులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందుబాటులో ఉండేలా చూసేందుకు కట్టుబడి ఉంది. ప్రపంచ అధ్యయనాలు వివిధ ఆహారాలలో మైక్రోప్లాస్టిక్‌ల ఉనికిని ప్రముఖంగా ప్రస్తావించినప్పటికీ, భారతదేశానికి సంబంధించిన విశ్వసనీయ, విస్తృత సమాచారాన్ని రూపొందించడం అత్యవసరం. ఈ ప్రాజెక్ట్ భారతీయ ఆహారంలో మైక్రోప్లాస్టిక్ కాలుష్య పరిధిని అర్థం చేసుకోవడంలో సహాయపడుతుంది. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి సమర్థవంతమైన నిబంధనలు, భద్రతా ప్రమాణాలను రూపొందించడానికి మార్గనిర్దేశం చేస్తుంది.

ఈ ప్రాజెక్ట్ ఫలితాల ఆధారంగా నియంత్రణ చర్యలను తీసుకోవడమే కాకుండా, మైక్రోప్లాస్టిక్ కాలుష్యంపై ప్రపంచ అవగాహనకు అవకాశం లభిస్తుంది. ఈ పర్యావరణ సవాలును ఎదుర్కోవడానికి ప్రపంచ వ్యాప్తంగా జరిగే ప్రయత్నంలో భారతీయ పరిశోధన ఒక అంతర్భాగం.

# పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ) కింద అహ్మదాబాద్‌లో 188 మంది శరణార్థులకు పౌరసత్వ ధ్రువీకరణ పత్రాల పంపిణీ

న్యూఢిల్లీ, ఆగస్టు 19: :కేంద్ర హోం, సహకారశాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పౌరసత్వ సవరణ చట్టం (అం) శరణార్థులైన 188 మంది సోదరీసోదరులకు పౌరసత్వ పత్రాలను పంపిణీ చేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్ సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా మాట్లాడుతూ.. దేశంలో స్థిరపడిన లక్షలాది శరణార్థులకు పౌరసత్వం ఇవ్వడం మాత్రమే కాకుండా, వారికి న్యాయం, హక్కులను కూడా సిఏఏ కల్పిస్తుందన్నారు. గత ప్రభుత్వాల బుజ్జగింపు విధానాల వల్ల 1947 నుంచి 2014 వరకు దేశాన్ని ఆశ్రయించిన ప్రజలకు హక్కులు, న్యాయం దక్కలేదన్నారు. పొరుగు దేశాల్లోనే కాకుండా ఇక్కడ కూడా వారు కష్టాలు పడినట్లు మంత్రి పేర్కొన్నారు. లక్షలాది మంది ప్రజలు మూడు తరాలుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్నారని, అయితే ప్రతిపక్షాలు అనుసరించిన అసమర్థ విధానాల వల్ల వారికి న్యాయం జరగలేదని శ్రీ షా విమర్శించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కోట్లాది మంది శరణార్థులకు న్యాయం చేశారన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో భారతదేశాన్ని మత ప్రాతిపదికన విభజించారని, ఆ సమయంలో తీవ్ర అల్లర్లు జరిగాయని కేంద్ర హోం మంత్రి పేర్కొన్నారు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న కోట్లాది మంది హిందువులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు, క్రైస్తవులు వారు పడిన కష్టాలను మరిచిపోలేరన్నారు. అనేక కుటుంబాలు నాశనం అయ్యాయన్నారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నవారు పొరుగు దేశాల నుంచి వచ్చే హిందూ, బౌద్ధ, సిక్కు, జైన, క్రైస్తవ వర్గాలకు చెందిన వారికి భారత పౌరసత్వం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఎన్నికల సమయానికి అప్పటి ప్రభుత్వ నాయకులు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. 1947, 1948, 1950లలో ఇచ్చిన హామీలను వారు మరిచిపోయారని శ్రీ షా పేర్కొన్నారు. వారి ఓటు బ్యాంకులకు కోపం వస్తుందన్న కారణంతోనే అప్పటి ప్రభుత్వం శరణార్థులకు పౌరసత్వం ఇవ్వలేదన్నారు. వారి బుజ్జగింపు విధానం వల్ల లక్షలాది మంది పౌరసత్వం కోల్పోయారని, దీనికంటే పెద్ద పాపం మరొకటి లేదని ఆయన అన్నారు.

కోట్లాది మంది ప్రజలు వలసపోయి కష్టాలు పడ్డారని, చాలా మంది తమ కుటుంబాలు, ఆస్తులను పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ వారికి భారతదేశంలో పౌరసత్వం కూడా లభించలేదని శ్రీ అమిత్ షా తెలిపారు. 1947-2019, 2019-2024 మధ్యకాలంలో జరిగిన పరిణామాలు దేశచరిత్రలో ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. ఆత్మగౌరవాన్ని కోరుకుంటూ పొరుగు దేశాల నుంచి భారత్‌కు వచ్చిన వారికి ఎందుకు పౌరసత్వం ఇవ్వలేకపోయారని షా ప్రతిపక్షాలను ప్రశ్నించారు. సరిహద్దులు దాటి దేశంలోకి అక్రమంగా చొరబడిన కోట్లాది మందిని అక్రమంగా భారత పౌరులుగా మార్చిన నేటి ప్రతిపక్షం, మరో వైపు- చట్ట ప్రకారం వ్యవహరించిన శరణార్థులను చట్టపరమైన నిబంధనలు లేవంటూ మోసం చేసిందని శ్రీ షా దుయ్యబట్టారు.

ప్రజల మేలు కోసమే చట్టం ఉందని, చట్టం కోసం ప్రజలు కాదని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అన్నారు. సిఏఏ తీసుకొస్తామని 2014లో హామీ ఇచ్చిన మేరకు, 2019లో మోదీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ఇన్నాళ్లు న్యాయం జరగని కోట్లాది మంది హిందువులు, జైనులు, బౌద్ధులు, సిక్కులకు ఈ చట్టం ద్వారా న్యాయం జరుగుతోందని అన్నారు. ఈ చట్టాన్ని 2019లోనే ఆమోదించామనీ, అప్పటికీ ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొట్టాయన్నారు. అంతేగాక ముస్లింల పౌరసత్వాన్ని ఈ చట్టం రద్దు చేస్తుందని దుష్ప్రచారం చేశారని శ్రీ షా పేర్కొన్నారు. ఈ చట్టం ప్రకారం పౌరసత్వం ఎవరు తీసుకోవాలన్న నిబంధన లేదని, పౌరసత్వం ఇవ్వాలన్నదే చట్టం ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. మన దేశంలో మన దేశ ప్రజలే నిస్సహాయంగా బతికే పరిస్థితి ఉండేదని, ఇంతకంటే దౌర్భాగ్యం, విడ్డూరం ఏముంటుందని షా ప్రశ్నించారు. ప్రతిపక్షాల అసమర్థ విధానాల వల్ల ఎన్నో ఏళ్లుగా సాధ్యంకానిది ప్రధాని మోదీ సుసాధ్యం చేసి 2019లో ఈ చట్టాన్ని తీసుకొచ్చారని షా తెలిపారు.

2019లో ఈ చట్టం వచ్చిన తర్వాత కూడా కొందరు దేశంలో అల్లర్లను ప్రేరేపించడం, అలాగే మైనారిటీలను రెచ్చగొట్టడంతో ఈ కుటుంబాలకు 2024 వరకు పౌరసత్వం లభించలేదని అమిత్ షా విచారం వ్యక్తం చేశారు. సిఏఏ గురించి దేశంలో పుకార్లు వ్యాపింపజేశారని పేర్కొన్నారు. ఈ చట్టం ఎవరి పౌరసత్వాన్ని రద్దు చేయదని, హిందూ, జైన, సిక్కు, బౌద్ధ శరణార్థులకు పౌరసత్వం ఇవ్వడమే ఈ చట్టం ఉద్దేశమని అన్నారు. నేటికీ కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దీని విషయంగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని శ్రీ షా విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న శరణార్థులు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి నిర్భయంగా ముందుకురావాలని, దీని వల్ల వారి ఉద్యోగాలు, ఇళ్లు మొదలైన వాటిపై ఎలాంటి ప్రభావం ఉండదని కేంద్ర హోం మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఈ చట్టంలో ఎలాంటి నేర సంబంధ విచారణ నిబంధన లేదని, అందరికీ క్షమాభిక్ష ప్రసాదించినట్లు మంత్రి తెలిపారు. పౌరసత్వం ఇవ్వడంలో జాప్యం గత ప్రభుత్వాల వల్లే జరిగిందని, ప్రజల వల్ల కాదని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న శరణార్థులకు న్యాయం, గౌరవం కల్పించేందుకు ఈ చట్టం పనిచేస్తుందని, శరణార్థులపై జరిగిన అకృత్యాలకు ఇది ప్రాయశ్చిత్తం అవుతుందన్నారు.

దేశ విభజన జరిగినప్పుడు బంగ్లాదేశ్‌లో 27 శాతం మంది హిందువులు ఉండగా, నేడు హిందూ జనాభా కేవలం 9 శాతం మాత్రమే ఉండడం శోచనీయమని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. మిగిలిన హిందువులు ఎక్కడికి వెళ్లారని ఆయన ప్రశ్నించారు. బలవంతంగా హిందువులను మతమార్పిడి చేయించారని అన్నారు. మా ఆశ్రయం కోరి వచ్చిన వ్యక్తులు ఆత్మగౌరవంతో జీవిస్తూ వారికి నచ్చిన మతాన్ని ఆచరించవచ్చన్నారు. పొరుగు దేశంలో గౌరవంతో జీవించలేక మన ఆశ్రయానికి వస్తే వారి విషయంలో మనం మౌనంగా చూస్తూ ఉండలేమన్నారు. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వమని, ఈ ప్రభుత్వంలో ప్రజలందరికీ కచ్చితంగా న్యాయం జరుగుతుందని అన్నారు.

ఈ చట్టాన్ని తీసుకురావాలని శరణార్థులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. 2019లో ప్రధాని మోదీ గట్టి నిర్ణయం తీసుకుని ఈ చట్టం ఆమోదానికి కృషి చేశారని కేంద్ర హోం మంత్రి పేర్కొన్నారు. ఈ చట్టం ఆమోదం పొందిన తర్వాత కొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. అయితే చివరకు 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు దరఖాస్తుదారులకు పౌరసత్వ హక్కు ధృవీకరణ పత్రంతో పాటు అవసరమైన నియమావళిని తీసుకురాగలిగామని చెప్పారు. ఈ దేశ ప్రజాస్వామ్యం బంధుప్రీతి, కులతత్వం, బుజ్జగింపులు, అవినీతి అనే నాలుగు దురాచారాలతో బాధపడుతోందని 2014లో శ్రీ నరేంద్ర మోదీ చెప్పిన విషయాన్ని శ్రీ అమిత్ షా ఈ సందర్భంగా గుర్తుచేశారు. గత పదేళ్లుగా మోదీ ఈ నాలుగు దురాచారాలను రూపుమాపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. ఆగస్టు 15వ తేదీన వారసత్వ రాజకీయాలకు స్వస్తిపలకాలని ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. రాజకీయ నేపథ్యం లేని కుటుంబాల నుండి లక్ష మంది యువత రాజకీయాల్లోకి రావాలని మోదీ పిలుపునిచ్చినట్లు తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా మోదీ నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు. కుల దురాచారాన్ని అంతం చేసేందుకు పేదలు, మహిళలు, యువత, రైతులు అనే నాలుగు కులాలను మోదీజీ ప్రకటించారని షా పేర్కొన్నారు. ప్రధాని మోదీ కొత్త తరహా రాజకీయ విధానాలను దేశం ముందు ఉంచి, బుజ్జగింపు రాజకీయాలకు స్వస్తి పలికారని అమిత్ షా పేర్కొన్నారు.

గతంలో దశాబ్దాల తరబడి దేశాన్ని ఎన్నో సమస్యలు చుట్టుముట్టి ఉన్నాయని దేశీయ వ్యవహారాల మంత్రి పేర్కొన్నారు. ఉదాహరణకు, 550 ఏళ్ల తర్వాత అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించే పనిని మోదీజీ పూర్తి చేశారన్నారు. అదేవిధంగా, ఔరంగజేబు నాశనం చేసిన కాశీ విశ్వనాథ దేవాలయాన్నీ, మహ్మద్ బేగడ నాశనం చేసిన పావగఢ్ శక్తిపీఠాన్ని పునరుద్ధరించినట్లు తెలిపారు. భారత్‌లో ట్రిపుల్ తలాక్ దురాచారాన్ని అంతమొందించే గొప్ప కార్యాన్ని కూడా నరేంద్ర మోదీ పూర్తి చేశారని అన్నారు. ఉగ్రవాదులను తయారు చేయడం, ఉగ్రకార్యకలాపాలకు ప్రధాన కారణమైన ఆర్టికల్ 370ని కూడా ప్రధాని మోదీ రద్దు చేశారని శ్రీ షా అన్నారు. అదేవిధంగా, పౌరసత్వ చట్టానికి సవరణలు చేయడం ద్వారా శ్రీ నరేంద్ర మోదీ జీ తమ హక్కులను కోల్పోయిన కోట్లాది మంది హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైన సోదరులకి న్యాయం చేశారన్నారు.

దేశ వ్యాప్తంగా ఉన్న శరణార్థులను ప్రతిపక్ష పార్టీలు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని, అయితే వారు భయాందోళనలకు గురికావద్దని శ్రీ అమిత్ షా కోరారు. మైనారిటీలను తప్పుదోవ పట్టించే వారు... మైనారిటీలకు స్వయంగా వారే అన్యాయం చేస్తున్న విషయం తెలుసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలను ఉద్దేశించి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ, ఈ చట్టాన్ని తీసుకువచ్చే ధైర్యం వాళ్లకు లేదని, కనీసం దీనిని అమలు చేయడంలో మోదీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని సూచించారు.

# కలుషిత ఆహారం తిని నలుగురు విద్యార్థుల మృతి

### -మరో 27 మంది స్టూడెంట్స్‌కి అస్వస్థత
### -హోమ్ మంత్రి అనిత గ్భ్రాంతి
### -అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స

అమరావతి, ఆగష్టు 19 : అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం లోని ఒక ప్రైవేటు ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని నలుగురు విద్యార్థులు మృతి చెందగా మరో 27 మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో జిల్లాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ అనాథాశ్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ ఉంటూ చదువుకుంటున్నారు.

అనాథాశ్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఫుడ్‌తోపాటు సమోసాలను పిల్లలు తిన్నారు. సాయంత్రం పిల్లలందరూ వాంతులు అయ్యాయి. దీంతో నిర్వాహకులు భయపడి వారివారి ఇళ్లకు పిల్లలను పంపించేశారు. ఇంటికి చేరిన నలుగురు విద్యార్థులు మృతి చెందారు. మృతి చెందిన విద్యార్థులను జాషువా, భవాని, శ్రద్ధగా గుర్తించారు. మిగతా 27 మందికి నర్సీపట్నం, అనకాపల్లి ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఏడుగురు, అనకాపల్లి ఏరియా ఆసుపత్రిలో 20 మంది విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై డీఈవో అప్పారావు విచారణ చేపట్టారు.

ఇతర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులను వారి తల్లిదండ్రులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నర్సీపట్నంలో 16 మందని ప్రాథమిక చికిత్స అందించి అందులో 12 మంది చిన్నారులను మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. డౌన్‌ఊరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొంత మంది విద్యార్థులు, పాడేరు ఆసుపత్రిలో కొంత మంది చికిత్స పొందుతున్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న తర్వాత అధికారులు అప్రమత్తమయ్యారు. నర్సీపట్నం ఆర్డీఓ జయరాం, డి.ఎస్.పి మోహన్ ఆసుపత్రికి వచ్చి పరిస్థితి సమీక్షించారు. అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఏరియా ఆసుపత్రి చేరుకొని చిన్నారులు పరిస్థితి ఆరా తీశారు. జరిగిన ఘటనపై అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ గ్భ్రాంతి వ్యక్తం చేశారు. మెరుగైన చికిత్సను అందించాలని వైద్యులకు సూచించారు.

కోటవురట్ల మండలం కైలాసపట్నం పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన ట్రస్ట్ అనాథాశ్రమంలో ఫుడ్ పాయిజన్ పై హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. కలుషిత ఆహారం తిని విద్యార్థుల మృతి పట్ల ఆమె దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే కేజీహెచ్, నర్సీపట్నం ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో ఆమె ఫోన్‌లో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు.

అనాథాశ్రమంలో కలుషిత ఆహారంతో నలుగురు విద్యార్థుల మృతిచెందడంపై సీఎం చంద్రబాబు నాయుడు గ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# సోదరులకు రాఖీ కట్టి ప్రాణాలు విడిచింది..

మహబూబాబాద్ ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఓ యువతి తన సోదరులకు రాఖీ కట్టి ప్రాణాలు విడిచింది.. ఈ విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. నర్సింహులపేట మండలం కోదాడలో డిప్లొమా చదువుతున్న 17ఏళ్ల యువతిని ప్రేమ పేరుతో ఓ ఆకతాయి వేధిస్తుండటంతో మనస్తాపం చెంది గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, పరిస్థితి విషమించడంతో తాను రక్షాబంధన్ వరకు బతికి ఉంటానో లేదోనంటూ శనివారం రాత్రి తమ్ముడు, అన్నలకు రాఖీ కట్టిన యువతి.. గంటల్లోనే తుదిశ్వాస విడిచింది. దీంతో సోదరులు కన్నీరుమున్నీరయ్యారు. వారి కుటుంబంతోపాటు గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

# 2035 నాటికి అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్న ఇండియా

న్యూఢిల్లీ ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భారతీయ అంతరిక్ష కేంద్రం తాలూకు భారతీయ అంతరిక్ష స్టేషన్ (బిఎస్)ను 2035 నాటికి ఏర్పాటు చేస్తామని భావిస్తున్నట్లు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి (స్వతంత్ర) డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. కేంద్ర బడ్జెట్ 2024-25లో అంతరిక్ష రంగానికి సంబంధించి చేసిన ప్రకటనలు భవిష్యత్ దృష్టితో చేసినవని చెప్పారు. 2025 రెండవ అర్థ భాగం నాటికి అంతరిక్షంలోకి భారతీయుడిని పంపడం, 2040 నాటికి చంద్రునిపై మొదటి భారతీయుడిని దింపాలనే ప్రతిష్టాత్మక లక్ష్యం కలిగి ఉన్నట్లు తెలిపారు. కోవిడ్ కారణంగా ఆలస్యమైన 'గగన్‌యాన్', భారతదేశపు మొట్టమొదటి మానవ అంతరిక్ష యాత్ర ను వచ్చే ఏడాది చేపడతామన్నారు.

# వివరాలు సరిచేసుకుంటే సొమ్ము ఖాతాల్లో రుణమాఫీ జమ

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

హైదరాబాద్ ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీని చేసింది. అయితే.. చాలా మంది రైతులు రుణమాఫీ కాలేదని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షాలు సైతం ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. దీంతో రైతులు చేస్తున్న ఆందోళనలపై వ్యవసాయ శాఖ స్పందించింది. ఆధార్, పాస్‌బుక్, రేషన్‌కార్డు వివరాలు సరిగా లేనివారి రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. రైతులు వ్యవసాయ అధికారులను కలిసి, వివరాలు సరిచేసుకుంటే సొమ్ము ఖాతాల్లో జమ అవుతుంది. సాంకేతిక కారణాలతో కొందరి మాఫీ డబ్బులు వెనక్కి వచ్చాయి. మళ్లీ జమ చేశాం. రైతులు ఫిర్యాదు చేస్తే నెలలోగా పరిశీలించి, అర్హులకు మాఫీ వర్తింపజేస్తాం' అని ప్రకటించింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల కూడా స్పందిస్తూ.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అందరికీ తప్పకుండా రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు.

# 30 యాక్ట్ నిషేధాజ్ఞలు ఉల్లంఘించినందుకు నిరసన ర్యాలీ



ఆదిలాబాద్, ఆగష్టు 19 :: తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో సీఎం దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించిన ఘటనను సర్కారు సీరియస్‌గా పరిగణించింది. 30 యాక్ట్ నిషేధాజ్ఞలు ఉల్లంఘించి నిరసన ర్యాలీ నిర్వహించినందుకు కేసు నమోదు చేసినట్టు డిఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. సీఎంను కించపరిచే విధంగా శవయాత్ర నిర్వహించారని, అనుమతి లేకుండా నిరసన ర్యాలీలు నిర్వహించరాదని ఆయన తెలిపారు.

### రైతులపై కేసులు దుర్మార్గం : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

రుణమాఫీ తో ప్రభుత్వం రైతులను మోసగించేదిలా ఉందని ఎమ్మెల్యే అనిల్ యాదవ్ అన్నారు. సోమవారం రు య్యాడి గ్రామాన్ని సందర్శించి రైతులకు సంఘీభావం ప్రకటించారు.

60 శాతం మంది రైతులకు రుణమాఫీ సొమ్ము జమ కాలేదని, రైతులు శాంతియుతంగా నిరసన నిర్వహిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారని ఆరోపించారు.

రైతుల సమస్యను పరిష్కరించకుండా సర్కారు నియంతలా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు.

పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మాజీ మంత్రి హరీష్ రావు రుయ్యాడి రైతులపై కేసులను తీవ్రంగా ఖండించారు.

# హత్యాచారం, గొంతు పిసికి చంపడం వల్ల ట్రెయినీ డాక్టర్ హత్య

### -శవపరీక్షలో ఆమెకు 14 గాయాలయినట్లు ధ్రువీకరణ




కోల్ కతా ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆర్ జి కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ లో ఇటీవల 31 ఏళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రెయినీ డాక్టర్ హత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే. ఆమె శవపరీక్ష(అటాప్సీ) ఆమెకు 14 గాయాలయినట్లు ధ్రువీకరించింది. పైగా హత్యాచారానికి గురయిందని రుజువయింది. గాయలు, గొంతు పిసికి చంపడం వంటివి జరిగాయని రుజువయింది. ట్రెయినీ డాక్టర్ తల, ముఖం, మెడ, చేతులు, మర్మాంగాల పై ఉన్న గాయాలు ఆమె ఘోరంగా హత్యాచారానికి గురయిందని రుజువుచేస్తున్నాయి. ఆమెను గొంతు పిసకడం వల్ల ఊపిరాడకుండా చనిపోయిందని కూడా తెలుస్తోంది. ఆమె లైంగిక దాడి జరిగిందనడానికి ఆమె శరీరంపై ఉన్న గాయాలే సాక్ష్యం. అంతేకాక ఆమె మర్మాంగంలోకి బలవంతంగా పెనెట్రేషన్ చేసినట్లు కూడా రుజువయింది. బాధితురాలి మర్మాంగంలో తెల్లటి, మందమైన, చిక్కటి ఇంద్రియం లభించింది. బాధితురాలు ముక్కు, దవడ, ఎడమ చేయి, భుజం పై ఉన్న గాయాల ప్రకారం ఆమె హత్యాచారానికి ముందు చాలా పెనుగులాండిందని, పోరాడిందని తెలుస్తోంది. కానీ అగంతకులు ఆమెను తమ శారీరక బలంతో లోబరుచుకున్నారని తెలుస్తోంది. మృత దేహాన్ని చూసిన సాక్షులు ఆమె నీలం రంగు బెడ్ షీట్ లో మెడ నుంచి మోకాళ్ల వరకు చుట్టి ఉండడాన్ని, ఆమె కుర్తా తొలగిపోయి ఉండడం, ఆమె ట్రౌజర్లు కనిపించకపోవడం, ఆమె ల్యాప్ టాప్, నోట్ బుక్, సెల్ ఫోన్, ఓ వాటర్ బాటిల్ ఆమె శరీరం ప్రక్కన ఉండడం చూశామన్నారని అబిజ్ఞ వర్గాలు తెలిపాయి. ఆమె చావుకు కారణం గొంతు పిసకడమేనని తేలింది. ఆమె గాఢ నిద్రలో ఉండగా దాడి జరిగిందని కూడా శవ పరీక్ష నివేదిక పేర్కొంది.

# అభివృద్ధిలో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గం: అమిత్ షా

న్యూఢిల్లీ, ఆగష్టు 19: :కేంద్ర హోం మంత్రి, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు గుజరాత్‌లోని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.1003 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్‌తో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన కార్యక్రమాలకు ముందు ఆయన అహ్మదాబాద్‌లోని తల్తేజ్‌లో 'ఆక్సిజన్ పార్క్'ను ప్రారంభించారు. వేజల్పూర్‌లో 'మిషన్ 3 మిలియన్ ట్రీ స్కీమ్' కింద మొక్కలను నాటారు. మకర్బరలో నూతనంగా నిర్మించిన స్విమ్మింగ్ పూల్, జిమ్‌ను కూడా ప్రారంభించారు.

ప్రారంభోత్సవం, అభివృద్ధి ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో ప్రసంగించిన కేంద్ర హోంమంత్రి.. ఈ రోజు అహ్మదాబాద్ నగరంలో ప్రారంభమవుతున్న అభివృద్ధి పనుల్లో గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో రూ.730 కోట్ల విలువైన పనులను చేస్తున్నామని, మిగిలినవి మరో రెండు లోక్ సభ నియోజకవర్గాల్లో ఉన్నాయని అన్నారు. తాను లోక్‌సభ ఎంపీగా ఉన్న గత ఐదేళ్లలో గాంధీనగర్ నియోజకవర్గంలోని మున్సిపల్ కార్పొరేషన్, గుజరాత్ ప్రభుత్వం ఏడాదికి రూ.5,000 కోట్ల కంటే తక్కువ విలువైన అభివృద్ధి పనులు చేయని ఒక్క సంవత్సరం ఒకటి కూడా లేదని అన్నారు. గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధిలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోందన్నారు.

ప్రజా పనుల్లో భాగంగా గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో జాతికి అంకితం చేసిన 21 ప్రాజెక్టుల్లో నాలుగు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశామని.. మరో రెండు లోక్ సభ నియోజకవర్గాల్లో 18 ప్రాజెక్టులను ప్రారంభించామని, రెండింటికి శంకుస్థాపనలు చేశామని అమిత్ షా తెలిపారు. పారిశుద్ధ్యం, ప్రజారోగ్యానికి సంబంధించిన అభివృద్ధి పనులు, పిల్లలకు మంచి వేదిక కల్పించే సంస్థను ప్రారంభించడం, పర్యావరణ పరిరక్షణకు ఆక్సిజన్ పార్కును అంకితం చేయడం వంటివి ఇందులో ఉన్నాయి.

భవిష్యత్ తరాల కోసం 100 రోజుల్లో 30 లక్షల మొక్కలు నాటాలని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంకల్పించిందని ఆయన తెలిపారు. ఈ ప్రశంసనీయమైన కార్యక్రమంతో తనకు సన్నిహిత సంబంధం ఉందని ఆయన అన్నారు. ప్రతి సొసైటీ చైర్మన్‌కు, కార్యదర్శికి, ప్రతి గ్రామ సర్పంచ్‌కు, ప్రతి మునిసిపల్ కౌన్సిలర్‌కు, ఇతర ప్రజా ప్రతినిధులకు లేఖలు రాసి ఫోన్లు చేసినట్లు వెల్లడించారు. అహ్మదాబాద్ వాసులు తమ సొసైటీలో, సమీపంలోని ఖాళీ స్థలాల్లో, పిల్లల పాఠశాలల్లో వారి కుటుంబ సభ్యులసంఖ్యకు అనుగుణంగా మొక్కలు నాటాలని కోరారు. మన జీవితకాలంలో మనం విడుదల చేసే కార్బన్ డయాక్సైడ్‌కు సమానంగా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయడానికి అవసరమైనన్ని చెట్లను నాటాలని ఆయన కోరారు. వాహనం, శరీరం, ఏసీ, విద్యుత్తు దీపాల ద్వారా మనం ఉత్పత్తి చేసే కార్బన్ డయాక్సైడ్ మొత్తాన్నీ తగ్గించటమే లక్ష్యంగా, ప్రతి పౌరుడూ సాగాలని, కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గిస్తూ ఆక్సిజన్‌ను పెంచాలని సూచించారు. వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ రెండూ భూమికి, మానవ మనుగడకు తీవ్రమైన ముప్పు అని ఆయన పేర్కొన్నారు.

ప్రధాన మంత్రీ, గుజరాత్ బిడ్డ అయిన శ్రీ నరేంద్ర మోదీ దేశ ప్రజలకు 'ఏక్ పేడ్ మా కే నామ్ (తల్లి పేరు మీద ఒక మొక్క)' నాటాలని పిలుపునిచ్చినట్లు శ్రీ అమిత్ షా గుర్తు చేశారు. తల్లి బతికి ఉంటే ఆమెతో పాటు చెట్టు నాటాలని, ఆమె చనిపోతే ఆమె ఫోటోతో ఆ చెట్టును నాటాలని చెప్పారు. తల్లుల రుణాన్ని తీర్చుకునేందుకు ఇంతకంటే మంచి మార్గం లేదు అని అన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్ని ఆక్సిజన్ పార్కులు, ఎన్ని మియావాకి అడవులను నిర్మించినా.. ఎన్ని చెట్లను నాటినా, అహ్మదాబాద్‌లోని ప్రతి పౌరుడు ఒక చెట్టును నాటితే, వాటి సంఖ్య అనేక రెట్లు పెరుగుతుందన్న కేంద్ర మంత్రి.. 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమంలో పాల్గొనాలని అహ్మదాబాద్ వాసులకు విజ్ఞప్తి చేశారు. మనమందరం ఒక మొక్కను నాటడం మన బాధ్యతగా భావించాలని ఆయన అన్నారు. మన ఎత్తుకు చెట్టు చేరే వరకు చిన్నపిల్లాడిలా చూసుకోవడం ద్వారా ఈ పనిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఇది కేవలం తల్లి పేరుతో ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న నినాదం కాదని, ఇది ప్రజా ఉద్యమం అని ఆయన అన్నారు.

60 ఏళ్ల తర్వాత దేశ ప్రజలు ఒక వ్యక్తిని మూడోసారి ప్రధానిని చేశారని, ఈ ఘనత నరేంద్ర మోదీకి దక్కిందని అమిత్ షా అన్నారు. అహ్మదాబాద్‌లో మొత్తం మూడు లోక్ సభ స్థానాలు, గుజరాత్ 25 స్థానాలు మోదీ గెలుచుకున్నారని వ్యాఖ్యానించారు.

అహ్మదాబాద్ భవిష్యత్తు ఆధారిత అభివృద్ధి, అభివృద్ధి చెందిన అహ్మదాబాద్ తమ సంకల్పమని అన్నారు. పొగ లేని, ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, ప్రతి ఒక్కరికీ ఆరోగ్య కార్డు ఉన్న నగరంగా అహ్మదాబాద్ ఉంటుందని పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో అటువంటి నగరాన్ని నిర్మించాలన్న ప్రతిజ్ఞను నెరవేరుస్తామని, అహ్మదాబాద్‌ను ప్రపంచ నగరాల్లో అగ్రస్థానానికి తీసుకురావడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ అందమైన స్విమ్మింగ్ పూల్స్, జిమ్‌లను నిర్మించిందని, యోగాసనాలు నేర్పించడానికి మంచి ఏర్పాట్లు చేసిందని తెలిపారు. జిమ్‌ను ఉచితంగా, స్విమ్మింగ్‌ను నామమాత్రపు రుసుముతో, యోగాసనాలను ఉచితంగా నేర్చుకోవచ్చని అన్నారు. అందమైన చెరువులు, ఆక్సిజన్ పార్కులను కూడా ఏర్పాటు చేశారు.

# తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ తప్పు చేయలేదు

### - కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు ఆగష్టు 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ తప్పు చేయలేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) కుంభకోణం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన గవర్నర్ ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించారు.

" నా రాజకీయ జీవి తం తెరచిన పుస్తకం. ఇప్పటి వరకూ ఎలాంటి తప్పు చేయలేదు. భవిస్యత్తు లోనూ చేయబోను. నా ప్రతిష్ఠను దెబ్బ తీసేందుకే బిజెపి, జెడిఎస్ కలిసి కుట్ర పన్నాయి" అన్నారు. "నా రాజకీయ జీవితంలో ఒక్క మరక లేదు. నా పై విచారణ చేయమంటూ గవర్నర్ ఇచ్చిన ఆదేశం రాజకీయ ప్రేరేపితమైనది. వాటిని రాజకీయంగా, న్యాయపరంగా ఎదుర్కొంటా" అని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. తనను నాశనం చేస్తే మొత్తం కాంగ్రెస్ పార్టీనే నాశనం చేయొచ్చన్న భ్రమలో బిజెపి ఉందని అన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీలో మాదిరిగా కర్ణాటకలో కూడా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. 'ముడా' విచారణ విషయంలో రాజీనామా చేయల్సిన అవసరం లేదన్నారు.

